విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :84 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 14 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## స్వయం సహాయక సంఘాలకు
# గుడ్ న్యూస్



- 10 మంది నిబంధన సడలింపు
- 8 మంది సభ్యులున్నా రిపీట్ డోస్ లబ్ది
- బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు

**అమరావతి**

స్వయం సహాయక సంఘాల మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10 కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్ డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని... ఈ క్రమంలోనే ఏపీ గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే వివరాలు 2లో..



## ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఒక జోకర్ల గుంపు

- అప్పటి వరకు వారిని నిద్రపోనివ్వం: రాహుల్ ఘాటు విమర్శలు
- అధికార పార్టీకి భిన్నంగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమన్న కాంగ్రెస్ అగ్రనేత
- ఆర్ఎస్ఎస్ నాయకులకు ప్రస్తుత భారతదేశంపై ఎలాంటి అవగాహన లేదని రాహుల్ వ్యాఖ్య
- ఆర్ఎస్ఎస్ బడా పెట్టుబడిదారుల చేతుల్లో సాధనంగా మారిపోయిందని విమర్శ

## అమరావతి నిర్మాణంలో
# మొదటి మెట్టు

- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్
- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయం పరిశీలన



**అమరావతి**

సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాభివద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ -- మంగళగిరి -- గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ--3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సీఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం-- పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్టైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ... 'రాష్ట్రాభివద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ వివరాలు 2లో..

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు

- ప్రత్యేక కోర్టులతోనే అన్నీ పరిష్కారం!: జస్టిస్ సూర్యకాంత్
- ప్రతి కేసుకు ఒకే కాలపరిమితి సాధ్యం కాదన్న సీజేఐ
- ప్రత్యేక కోర్టులు, టైమ్ బౌండ్ ట్రయల్స్‌తో పెండింగ్ కేసుల పరిష్కారం జరుగుతుందున్న జస్టిస్ సూర్యకాంత్





## పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు

- నినాదాల మధ్య ఉభయసభలు నిరవధిక వాయిదా
- చివరి రోజూ కొనసాగిన అధికార, విపక్షాల నిరసనలు
- లోక్‌సభలో వందేమాతరం గీతం అనంతరం సైన్ డై ప్రకటించిన స్పీకర్
- రాహుల్‌ను బీజేపీ టార్గెట్- కోతి బొమ్మతో కాంగ్రెస్ నిరసన

## ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత



- కుంకీ ఏనుగుల రాకతో ఏపీలో అద్భుత ఫలితాలు
- రాష్ట్రంలో ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు
- అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**విశాఖపట్నం**

'ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. నేను అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల బాధ్యతలను వివరాలు 2లో..

# చంద్రబాబు అరాచక పాలన

- ఇదేమి రాజ్యం.. బాధితులే నిందితులు
- శాశ్వతంగా మీరు అధికారంలో ఉందరు మూల్యం చెల్లించుకుంటారు
- జైలు లోపల నన్ను అవమానించారు
- వెన్నుపోటు పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే విరూపాక్ష అరెస్ట్ అధికార దుర్వినియోగానికి నిదర్శనం
- కర్నూలు జైల్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షితో వైయస్ జగన్ ములాఖత్



**కర్నూలు**

రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసు వ్యవస్థ సర్వనాశనం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుది అని నిత్యం వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారనిరాష్ట్రంలో చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బాధితులనే నిందితులుగా మార్చడం, దాడికి గురైన వారిపైనే కేసులు పెట్టడం, బాధితులకు అండగా నిలిచిన వారిని అరెస్ట్ చేయడం రాష్ట్రంలో పరిపాటిగా మారిందన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యే ఇంటిపై అర్ధరాత్రి వందలాది మంది పోలీసులతో దాడి చేసి, తలుపులు పగులగొట్టి అరెస్ట్ చేయడం ఇందుకు పరాకాష్ట అని పేర్కొన్నారు. కర్నూలు జైల్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షితో ములాఖత్ అనంతరం వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ. వివరాలు 2లో..



## చైనా ముప్పు'ను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో
# అభివృద్ధి మంత్రం

- సరిహద్దు గ్రామాల్ని దేశపు తొలి గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- జెమితాంగ్‌లో రోడ్లు, విద్యుత్, వైద్యం, పర్యటకంతో మారుతున్న పరిస్థితులు
- మౌలిక వసతులున్నా ఉపాధి లేక ఖాళీ!

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!

- సీఈఓ పోస్టు కోసం 5,585 దరఖాస్తులు
- సీఈఓ ఎంపిక కోసం సెర్చ్ కమిటీ ఇంటర్వ్యూలు
- ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు
- పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం



# విజయసాయిపార్టీ లీకుల వ్యూహం ఏమిటీ

**నెల్లూరు :** వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్-2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చుఈ



పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయ సాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మహాకుంభమేళ తరహాలో
# గోదావరి పుష్కరాలు

**రాజమండ్రి :** ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తరహాలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యున్నత వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మహాక్రతువు కోసం మొత్తం అంచనా వ్యయం రూ.8,500 కోట్లుగా నిర్ధారించగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది.పుష్కరాల నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖలకు నిధుల కేటాయింపులను ప్రభుత్వం పక్కాగా వర్గీకరించింది. గోదావరి తీరంలో భక్తుల రద్దీని తట్టుకునేలా 238 పాత , కొత్త పుష్కర ఘాట్ల ఆధునీకరణ, మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ.210.06 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ పనుల నిమిత్తం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.150 కోట్లు విడుదల కాగా, గోదావరి తీరమంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ.60 కోట్లు, టూరిజం సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల విస్తరణకు పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.10 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈసారి పుష్కరాలలో డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాది మంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ సర్వైలెన్స్, రియల్ టైమ్ కంట్రోల్ రూమ్‌లను



అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. భక్తులు తాము స్నానం చేయాలనుకునే ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను, క్యూఆర్ కోడ్ నేవిగేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.నది తీరం పొడవునా పారిశుధ్యం, భద్రత , పర్యావరణ పరిరక్షణ విషయాలలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నది నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫిల్ట్రేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేయడమే కాక, ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది , స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేస్తాయి. రాజమండ్రి, కోవూరు, నరసాపురం, భద్రాచలం పరిసర ప్రాంతాల గోదావరి తీరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు భక్తిపారవశ్యంతో పాటు అధునాతనమైన, సురక్షితమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా వైభవంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి.

# మిత్రపక్షాల మధ్య డిజిటల్ వార్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి తమ సోషల్ మీడియా శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. కొద్దిరోజులుగా సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన సైనికుల మధ్య సాగుతున్న పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు శృతిమించి కూటమి ఐక్యతకే సవాలుగా మారిన తరుణంలో నాయకత్వం ఈ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. గొడ్డలి పార్టీ కుట్రపూరితంగా సృష్టించిన నకిలీ ఖాతాల వల్ల ఈ అంతర్గత కలహాలు నడుస్తున్నాయని, ఆ ట్రాప్‌లో పడ వద్దని కూటమి సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ స్పష్టమైన ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని వారాలుగా సోషల్ మీడి యాను గమనిస్తే.. పశ్చిమ ఏపీలోని అధికార సమన్వయం నుంచి మొదలుకొని, సినిమాలు, ఐకాన్స్, రాజకీయ ప్రాధాన్యతల వరకు టీడీపీ-జనసేన క్యాడర్ మధ్య ఘాటైన సైబర్ యుద్ధమే సాగుతోంది. సినిమాల నుంచి సీనియర్ ఎన్టీఆర్ ఆహారపు అలవాట్ల వరకూ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేసుకోవడం నిత్యకృత్యమైంది. గ్రౌండ్ లెవల్‌లో నాయకుల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ, సోషల్ మీడియా డిజిటల్ స్పేస్‌లో



చోటుచేసుకుంటున్న ఈ తీవ్ర స్వభావపు విమర్శలు అసలైన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రత్యర్థులకు బలమైన రాజకీయ ఆయుధాన్ని అందించాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని విపక్ష వైసీపీ సైబర్ వింగ్ అత్యంత వ్యూహాత్మకంగా సూడో అకౌంట్స్ నడుపుతోందని కూటమి సంయుక్త ప్రకటన ఎండగట్టింది. ఒక టీడీపీ అభిమానిలా ప్రొఫైల్ రూపొందించి పవన్ కల్యాణ్‌ను హేళన చేయడం, అలాగే జనసేన సైనికుడి ముసుగులో చంద్రబాబు లేదా లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా ఇరు వర్గాల అసలైన కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైనాన్ని కమిటీ గుర్తించింది. ఈ డిజిటల్ ట్రాప్ వల్ల నిజమైన సైనికులు ఆవేశానికి లోనై ఒకరినొకరు కించపరుచుకుంటూ, చివరికి తమ సొంత ప్రభుత్వ విజయావకాశాలను, పథకాల ప్రచారాన్ని పక్కనబెట్టి అంతర్గత పోరులోనే శక్తిని వృథా చేసుకుంటున్నారు. రాజకీయాల్లో క్షేత్రస్థాయి ఐక్యత ఎంత ముఖ్యమో, డిజిటల్ మైండ్ స్పేస్‌లో పొత్తు ధర్మాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కీలకం. శ్రేణుల మధ్య స్వల్ప విబేధాలు కాస్తా పార్టీల అగ్రనేతల మధ్య వైరి వర్గాలుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉందని గ్రహించినందునే ఈ ఉమ్మడి ప్రకటన వెలువడింది. సంయమనం పాటించకపోతే, మిత్రపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకుని విద్వేషం చిమ్మే ఏ అకౌంట్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేయడం మంచి పరిణామం అనుకోవచ్చు. ఆవేశాన్ని పక్కనబెట్టి, ప్రత్యర్థుల నకిలీ వ్యూహాలను తిప్పికొడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపైనే కూటమి సోషల్ సైన్యాలు దృష్టి సారించాల్సి ఉంది.

## చంద్రబాబు అరాచక పాలన

-మొదటిపేజీ తరువాయి

ఆగస్టు 1న చిప్పగిరి మండలంలోని సంగాల గ్రామంలో వైయస్ఆర్‌సీపీ కార్యకర్త గిరిపై, ఆయన ఇంటిపై దాడి జరిగింది. సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎమ్మెల్యేకు గిరి రాత్రి 7.45 గంటలకు ఫోన్ చేసి, తనపై దాడి జరుగుతోందని, తన ఇంటి ఫొటోలు, వీడియోలు కూడా పంపించి రక్షించాలని కోరాడు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 7.47 గంటలకు చిప్పగిరి ఎస్ఐకి ఫోన్ చేసి సంఘాల వెళ్లి గిరిని కాపాడాలని కోరారు. అనంతరం సీఐకి ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఉదయం 8.03 గంటలకు మరోసారి సీఐకి సమాచారం ఇచ్చారు. అయినా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లలేదని తెలిపారు. పోలీసులు స్పందించకపోవడంతో గిరిని కాపాడేందుకు ఎమ్మెల్యే స్వయంగా సంఘాల గ్రామానికి వెళ్లారు. అక్కడ పరిస్థితిని చక్కదిద్ది, గిరిని తన కారులో ఎక్కించుకుని చిప్పగిరికి తీసుకువస్తుండగా నేమకల్లు వద్ద ఎమ్మెల్యేపైనే దాడి జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు గాయపడి చేయి విరిగిందని పేర్కొన్నారు. బాధిత కార్యకర్తను కాపాడేందుకు వెళ్లడాన్నే ఎమ్మెల్యేపై పెట్టిన మొదటి కేసుగా మార్చారని అన్నారు. నేమకల్లు ఘటనను కప్పిపుచ్చేందుకు టీడీపీ కార్యకర్త తన భార్య దుస్తులను తానే చింపి, ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులు చింపారంటూ ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారని వైయస్ఆర్‌సీపీ నాయకుడు ఆరోపించారు. ఇది ఎమ్మెల్యేపై పెట్టిన రెండో కేసు అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కారును ధ్వంసం చేశారంటూ మూడో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. దాడిలో గాయపడిన ఎమ్మెల్యే తమ్ముడు శ్రీరాములు, దాడికి గురైన గిరిని తీసుకుని ఎమ్మెల్యే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమపై జరిగిన దాడిపై ఫిర్యాదు చేయాలని కోరినా పోలీసులు కనీసం ఫిర్యాదును కూడా తీసుకోలేదని తెలిపారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి వెళ్లినా బాధితుల ఫిర్యాదు స్వీకరించకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇది నాలుగో తప్పిదమని పేర్కొన్నారు. ఫిర్యాదు తీసుకోకపోవడమే కాకుండా బాధితులైన విరూపాక్ష, ఆయన కుటుంబ సభ్యులు, వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలపైనే రివర్స్ కేసులు పెట్టారని తెలిపారు. సంఘాల ఘటనకు సంబంధించిన ఫిర్యాదులోనే పలువురి పేర్లు వేర్వేరు నిందితుల జాబితాల్లో మళ్లీ మళ్లీ పునరావతం కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విచారణ లేకుండానే కేసుల్లో పేర్లు చేర్చినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇది ఐదో తప్పిదమని తెలిపారు. విరూపాక్షను పరామర్శించేందుకు తాను జైలుకు వెళ్లినప్పుడు తనను అవమానించేలా వ్యవహరించారని తెలిపారు. సాధారణంగా జైలుకు వచ్చే వారిని కూర్చోబెట్టి ఫొటోలు తీస్తారని, తనను మాత్రం గ్రిల్ బయట నిలబెట్టి ఫొటోలు తీశారని పేర్కొన్నారు. దీనిపై జైలు అధికారులను ప్రశ్నించగా, తనకు ప్రత్యేకంగా అలా చేయాలని ఆదేశాలు వచ్చాయని చెప్పారని తెలిపారు.

## అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

-మొదటిపేజీ తరువాయి

పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019--24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. 'అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. '2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి. 'అని సీఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సీఎం పరిశీలించారు.

## ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత

-మొదటిపేజీ తరువాయి

తీసుకున్న తర్వాత మొదటిగా ప్రజలకు, ఏనుగులతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం మీదనే దష్టి సారించాన'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మదపుటేనుగులను నిరోధించేందుకు నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వ సహాయంతో తీసుకొచ్చి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మానవులు -- వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను నివారించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఏజెన్సీ ఏరియాల్లో మంచి ఫలితాలొస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్ లో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఏనుగులు పర్యావరణ సమతుల్యతకు వారధిగా నిలుస్తాయి. దేశ వన్యప్రాణి వారసత్వానికి అవి చిహ్నాలు. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2014 నుంచి దేశంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాలు 26 నుంచి 33కు పెరిగాయి. కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. కుంకీ ఏనుగులను రాష్ట్రానికి అందించడంలో సహకరించిన కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అప్పటి అటవీ, పర్యావరణ శాఖమంత్రి ఈశ్వర్ ఖండ్రేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మానవులు -- వన్య ప్రాణుల మధ్య నెలకొన్న ఘర్షణలను పూర్తిగా నిరోధించేందుకు, వన్య ప్రాణులను రక్షణ కోసం రూపొందిన హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్, అటవీ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి సుశీల్ కుమార్ అవస్థి, రాష్ట్ర అటవీ మరియు పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ డాక్టర్ పి.వి. చలపతిరావు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ స్టీరింగ్ కమిటీ గౌరవ సభ్యులు, భారత ప్రభుత్వ, రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు గుడ్ న్యూస్

-మొదటిపేజీ తరువాయి

కొత్త మార్గదర్శకాల ప్రకారం కనీసం 8 మంది యాక్టివ్ సభ్యులు ఉన్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేస్తారని... అయితే సభ్యుల సంఖ్య తగ్గడానికి వలసలు లేదా మరణం మాత్రమే కారణమై ఉండడంతో పాటు... అక్రమాలు లేకుండా.. పాత బకాయలు లేకుండా సక్రమమైన చెల్లింపులు ఉండాలని కూడా మంత్రి సూచించారు. అర్హత గల సంఘాలు ప్రత్యేక తీర్మానం మరియు బాధ్యతా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. రుణ సడలింపు పొందిన సంఘాలు 6 నెలల వ్యవధిలో తమ సభ్యుల సంఖ్యను మరల కనీసం 10 మందికి పెంచుకోవాలని కూడా మంత్రి తెలిపారు.



# 2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ.

- మడిచర్ల ధర్మకోనేరు చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం.
- రూ.49.40 లక్షలతో పునరుద్ధరణ.
- కూటమి ప్రభుత్వం వచ్చాక మడిచర్లలో రూ.5.13 కోట్ల విలువైన అభివృద్ధి.
- మరో రూ.1.53 కోట్ల అభివృద్ధి పనులు ప్రతిపాదించాం.
- పనులు పూర్తయితే గ్రామంలో దాదాపు రూ.7 కోట్ల అభివృద్ధి ఎమ్మెల్యే.
- 70 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేని ఎస్సీ కాలనీకి రహదారి నిర్మాణం.
- ఇచ్చిన హామీ నెరవేర్చాం -- యార్లగడ్డ.







**గన్నవరం, పెన్ సత్తా, ఆగస్ట్ 13:** బాపులపాడు మండలం మడిచర్ల గ్రామంలో 2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిర్వహించారు. కృష్ణాజిల్లా టిడిపి అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమల శెట్టి రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. అనంతరం డబ్ల్యూడిసి - పిఎంకేఎస్వై 2.0 నిధులతో రూ.49.40 లక్షల వ్యయంతో పునరుద్ధరించిన మడిచర్ల ధర్మకోనేరు చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం ఈశాన్య ప్రాంతంలో ఉన్న మడిచర్ల గ్రామం గతంలో అభివృద్ధికి దూరంగా ఉండేదన్నారు. గతంలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించినా గ్రామానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. 2019లో తాను గ్రామాన్ని సందర్శించిన సమయం లోనూ, 2024 ఎన్నికల ప్రచారం లోనూ గ్రామం లోని ఎస్సీ కాలనీకి సుమారు 70 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేదని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చామని చెప్పారు. గన్నవరం నియోజకవర్గానికి ఎన్ఆర్ఈజీఎస్ సహా వివిధ పథకాల కింద సుమారు రూ.10 కోట్ల నిధులు వచ్చిన సమయంలో, మడిచర్ల చిన్న గ్రామమైనప్పటికీ సుమారు రూ.90 లక్షల మేర నిధులను కేటాయించి పనులు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాల్లో మడిచర్ల కూడా ఒకటని, ప్రస్తుతం గ్రామంలో చేపట్టిన పనులను చూస్తే పరిస్థితి ఎంతగా మారిందో ప్రజలే గమనిస్తున్నారని పేర్కొన్నారు. చెరువు చుట్టూ సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత మడిచర్లలో ఇప్పటివరకు రూ.5.13 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు యార్లగడ్డ వివరించారు. ధర్మకోనేరు చెరువు పునరుద్ధరణకు రూ.49.40 లక్షలు, మడిచర్ల నుంచి చల్లబోయినపల్లి వరకు బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.80 లక్షలు, 25 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.37 లక్షలు, ఎస్సీ శ్మశానవాటిక ప్రహరీ గోడకు రూ.2 లక్షలు, ఆరెపల్లి భాస్కరరావు ఇంటి వద్ద స్లాబ్ కల్వర్టుకు రూ.5 లక్షలు, న్యూ కాలనీలో అంతర్గత రోడ్లకు రూ.6 లక్షలు, ఇతర అంతర్గత సీసీ రోడ్లకు రూ.5 లక్షలు, పెద్ద ట్యాంకు అభివృద్ధికి రూ.3 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి పైప్‌లైన్ కోసం రూ.78 లక్షలు, వ్యవసాయ సేవల కింద ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ.2 కోట్లు, ఆర్డీఎస్ఎస్ పథకం కింద వివిధ విద్యుత్ పనులకు రూ.48 లక్షలు వెచ్చించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. గ్రామం లోని పామాయిల్ రైతులు, ఇతర రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పంచాయతీ, మండల స్థాయి నిధులతో కూడా డ్రైన్లు, రహదారుల మరమ్మతులు తదితర పనులు చేపట్టామని తెలిపారు. మడిచర్లలో మరో రూ.1.53 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులు ప్రతిపాదించినట్లు యార్లగడ్డ వెల్లడించారు. జల్ జీవన్ మిషన్ కింద అదనపు పైప్‌లైన్ పనులకు రూ.90 లక్షలు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌కు రూ.3 లక్షలు, జలహారతి కింద పెద్ద ట్యాంకు మరమ్మతులకు రూ.11.38 లక్షలు, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌కు రూ.15 లక్షలు, అంతర్గత సీసీ రోడ్లు, పైప్‌లైన్ పనులకు రూ.6.50 లక్షలు, 35 కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ.11.54 లక్షలు, మరో సీసీ రోడ్డుకు రూ.16 లక్షలు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇప్పటికే చేసిన రూ.5.13 కోట్ల పనులతో కలిపి ప్రతిపాదిత పనులు పూర్తయితే గ్రామంలో దాదాపు రూ.7 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగినట్లవుతుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు బదులుగా కేవలం సంక్షేమ పథకాల బటన్ నొక్కడం పైనే దృష్టి పెట్టారని యార్లగడ్డ విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాట పట్టిస్తున్నామని తెలిపారు. రానున్న రెండున్నరేళ్లలో గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధి అజెండాతో మరింత వేగంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. అనంతరం వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై ఎమ్మెల్యే విమర్శలు చేశారు. శాసనసభకు హాజరై ప్రజా సమస్యల పై చర్చించాల్సిన బాధ్యత ప్రజల ద్వారా ఎన్నికైన ప్రతినిధుల పై ఉందన్నారు. సభకు హాజరుకాకుండా బయట విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించకుండా జీతాలు తీసుకోవడం సమంజసం కాదని, 'నో వర్క్--నో పే' విధానం అన్ని రంగాల్లోనూ ఉందన్నారు. శాసనసభకు ఎందుకు హాజరు కావడం లేదో జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు స్పష్టంగా చెప్పాలని యార్లగడ్డ డిమాండ్ చేశారు. గతంలో శాసనసభలో జరిగిన అవమానాల కారణంగా కొందరు నేతలు సభను బహిష్కరించిన సందర్భాలు ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి కారణం ఏదీ లేకుండానే సభకు దూరంగా ఉండటం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యల పై చర్చించేందుకు శాసనసభే సరైన వేదిక అని చెప్పారు. డీఎస్సీ అంశం పై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శల పైనా యార్లగడ్డ స్పందించారు. డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్న వారు ముందుగా ఆధారాలు చూపాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలు, అభివృద్ధి, పెట్టుబడులపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ చేశారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడం, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల పై దృష్టి పెట్టడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వ పాలనలో ఎదురైన ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటకు తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని యార్లగడ్డ తెలిపారు. విమర్శలు చేయడం కంటే అభివృద్ధి పై చర్చకు రావాలని వైసీపీ నేతలను కోరారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగాలు, డీఎస్సీ, పెట్టుబడులు తదితర ఏ అంశం పై నైనా ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. మడిచర్ల గ్రామ ప్రజలు గత ఎన్నికల్లో తనకు మైనస్ ఫలితం ఇచ్చినా అభివృద్ధిలో ఎలాంటి వివక్ష చూపలేదని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ గ్రామానికి అవసర మైన పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ మడిచర్లను మరింత అభివృద్ధి చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గన్నవరం నుంచి వారణాసి, కోల్‌కతాకు ఇండిగో నూతన విమాన సర్వీసుల ప్రారంభం.







- వారణాసి తొలి విమానానికే 130 మంది ప్రయాణికుల బుకింగ్.
- గన్నవరం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలి యార్లగడ్డ.
- గన్నవరం విమానాశ్రయ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.

**గన్నవరం, పెన్ సత్తా, ఆగస్ట్ 13:** గన్నవరం నుంచి వారణాసి, కోల్‌కతాకు ఇండిగో నూతన విమాన సర్వీసులను విమానాశ్రయంలో ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు. ఈ సర్వీసులను దిల్లీ నుంచి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వర్చువల్‌గా ప్రారంభించారు. గన్నవరం విమానాశ్రయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి విమాన సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారణాసి తొలి విమాన సర్వీసుకే సుమారు 130 మంది ప్రయాణికులు బుక్ చేసుకోవడం విజయవాడకు ఉన్న విమానయాన సామర్థ్యాన్ని చాటుతుందన్నారు. శబరిమల యాత్రికుల సౌకర్యార్థం విజయవాడ నుంచి కొచ్చిన్ కు నేరుగా విమాన సర్వీసు ప్రారంభించాలని ఇండిగో ప్రతినిధులు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరినట్లు తెలిపారు. దీని పై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ ఏడాదిలోనే గన్నవరం విమానాశ్రయం నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించి మరిన్ని నగరాలకు విమాన అనుసంధానం కల్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. వారణాసికి నేరుగా విమాన సర్వీసు ప్రారంభించడం వల్ల భక్తులకు ప్రయాణ సమయం, ఖర్చు తగ్గి మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలకు చెందిన అనేక మంది ఎన్ఆర్ఐలు విదేశాల్లో నివసిస్తున్న నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ కనెక్టివిటీ ఏర్పడితే ఈ ప్రాంత అభివృద్ధికి అది గేమ్‌చేంజర్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఇండిగో సంస్థ షెడ్యూల్ ప్రకారం వారణాసి నుంచి మధ్యాహ్నం 3.55 గంటలకు బయలుదేరే విమానం సాయంత్రం 5.50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 6.20 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి రాత్రి 8.15 గంటలకు వారణాసి చేరుకుంటుంది. వారానికి మూడు రోజుల పాటు ఈ సర్వీసులు నడవనున్నాయి. అదే విమానం వారణాసి--కోల్‌కతా మార్గంలో కూడా సేవలు అందించనుంది. టికెట్ ధరలు సుమారు రూ.6,500 నుంచి రూ.8,000 మధ్య ఉండనున్నట్లు ఇండిగో సంస్థ వెల్లడించింది. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీ కాంత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ రామ చారి, ఇండిగో స్టేషన్ మేనేజర్ కౌశిక్ విశాల్, ఇండిగో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు, మహిళల భద్రతకే తొలి ప్రాధాన్యం హోం శాఖ మంత్రి అనిత.

- అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ 'అభయ' కార్యక్రమానికి విశేష స్పందన.
- నక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 'అభయ' ఫిర్యాదుల పెట్టెను ప్రారంభించిన అనిత.





**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 13:** విద్యార్థినులు, మహిళల రక్షణే ధ్యేయంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సమర్థవంత మైన మార్గదర్శకత్వంలో రూపుదిద్దుకున్న వినూత్న కార్యక్రమం "అభయ" సమాజంలో సరికొత్త నమ్మకాన్ని నింపుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం నక్కపల్లి లోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలురు) ను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన "అభయ" ఫిర్యాదుల పెట్టెను హోంమంత్రి స్వయంగా ప్రారంభించారు. అనంతరం బాక్స్ లో ఉన్న ఫిర్యాదులను పరిశీలించి, పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు ధైర్యాన్ని ఇస్తూ, భద్రతకు కొండంత అండగా నిలుస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ని, పోలీసు యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఎలాంటి భయసంకోచాలు లేకుండా తమ సమస్యలను 'అభయ' పెట్టె ద్వారా పోలీసుల దృష్టికి తీసుకురావచ్చని, అకతాయిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో శాంతి భద్రతల పరి రక్షణకు కృషి చేస్తున్న పోలీసు అధికారుల పనితీరు సమాజానికి ఎంతో ఆదర్శవంతమని ఆమె కొనియాడారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పతివాడ విజయ, పోలీసు ఇన్స్పెక్టర్లు మురళి, రామకృష్ణ, వినోద్ బాబు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఘనంగా తిరంగా యాత్ర బైక్ ర్యాలీ.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 13:** 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం విశాఖపశ్చిమ నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ విశాఖ పశ్చిమ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. గోపాలపట్నం నుండి ప్రారంభ మైన ఈ తిరంగా యాత్ర బైక్ ర్యాలీ, ఎన్.ఎ.డి. జంక్షన్ మీదుగా కరాస వరకు కోలాహలంగా సాగింది. ఈ ర్యాలీలో మాజీ సైనికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాలను చేతబూని దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణబాబు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించు కోవాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15 వరకు ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగిరేలా ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

పెన్ సత్తా
శుక్రవారం 14 ఆగస్టు 2026

## అమరావతి నుంచి జిల్లా కలెక్టర్ల సమీక్షలో కలెక్టర్



**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 13**: రాష్ట్రం లోని అన్ని జిల్లా కలెక్టర్లుతో గురువారం ఉదయం అమరావతి, కాన్ఫరెన్స్ హల్ 5 వ బ్లాక్ నుండి ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్స్ (పోలింగ్ కేంద్రాలు, సర్, ఫారం 6,7,ఁ 8) నకు సంబంధించి పలు కీలక అంశాల పై చర్చించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఆర్.డి.ఓ వై.సత్యనారాయణరావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాకు సంబంధించి జిల్లా కలెక్టర్ వివరిస్తూ డ్రాఫ్ట్ రోల్స్ ప్రచురణ పూర్తయిందని. బిఎల్ఓ మరియు బిఎల్ఎ ల సమావేశ మినిట్స్ కూడా అప్‌లోడ్ చేయడం జరిగిందని వివరించారు. మొత్తం 14,639 నోటీసులు పూర్తిగా జనరేట్ చేశామని, వీటిలో 10,000 నోటీసులను ఇప్పటివరకు పంపిణీ చేశామని, మిగిలినవి ఈరోజు పూర్తవుతాయి వివరించారు. ఇప్పటి వరకు 76 హియరింగ్స్ పూర్తయ్యాయని. గడువు ముగిసిన 701 నోటీసులను రీషెడ్యూల్ చేస్తున్నామని వివరించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల ఫామ్- 6,7,8లు సుమారు 10,000 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వివరించారు. ఈ వారాంతానికల్లా వీటిని పూర్తి చేస్తామని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కు కలెక్టర్ వివరించారు.

## వరహాల బాబు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటా

- **హోం మంత్రి అనిత భరోసా**
- **వరహాల బాబు చెల్లెలు శిరీష చదువు బాధ్యతను స్వీకరించిన మంత్రి అనిత**





**నక్కపల్లి, పెన్ సత్తా ఆగస్టు 13** :ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలై మృతి చెందిన విద్యార్థి వరహాల బాబు కుటుంబాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. నక్కపల్లిలో వరహాల బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి అనిత, అనంతరం కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరహాల బాబు కుటుంబ సభ్యులకు మంత్రి అనిత ధైర్యం చెప్పారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వరహాల బాబు చెల్లెలు శిరీష చదువు బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు మంత్రి అనిత ప్రకటించారు. శిరీష ఎంతవరకు చదువుకోవాలనుకున్నా, ఆమె చదివించే బాధ్యత తనదేనని మంత్రి అనిత హామీ ఇచ్చారు. శిరీష తన కాళ్లపై తాను నిలబడే వరకు తనకు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు.వరహాల బాబు కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటానని మంత్రి అనిత స్పష్టం చేశారు.

## నక్కపల్లిలో హోం మంత్రి ఇంటింటి ప్రచారం

**ఉత్సాహంగా పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు**



**నక్కపల్లి,పెన్ సత్తా ఆగస్టు 13**: మండల కేంద్రం నక్కపల్లిలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.రెండు ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో మంత్రి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్కపల్లి ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అనిత నక్కపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి , వాటిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.. పాయకరావుపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగ సైకిల్ ర్యాలీ







**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 13:** దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అనకాపల్లిలో 'హర్ ఘర్ తిరంగ సైకిల్ ర్యాలీ' అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. గురువారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు దేశభక్తిని చాటే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహభరితంగా స్వాతంత్ర దినోత్సవ నినాదాల నడుమ సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ముందుగా అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, కార్పొరేషన్ చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ళా సురేంద్ర లు, మార్కెట్ యార్డులో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలాలంకరణ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. మార్కెట్ యార్డు వద్ద దేశభక్తిని చాటే విధంగా స్కేటింగ్ విన్యాసాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. విద్యార్థుల నైపుణ్యాన్ని, వారిలోని ఉత్సాహాన్ని పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సైకిల్ ర్యాలీ నాలుగు రోజుల జంక్షన్ చేరుకున్న అనంతరం పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, రాజకీయాలకు అతీతంగా దేశం లోని ప్రతి గ్రామం నుండి ఢిల్లీ వరకు ఈ 'తిరంగ యాత్ర'ను ఒక పండుగలా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి నివాళులు అర్పించడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పాఠశాల, ఊరు, జిల్లా కేంద్రాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. అనకాపల్లి ప్రజలందరూ ఈ వేడుకల్లో భాగస్వాములై దేశభక్తిని చాటుకోవాలని కోరారు. స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచం లోనే అగ్రగామిగా భారత్ ను నిలపాలి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, భారత్‌ను ప్రపంచం లోనే నంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దేందుకు యువత పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 140 కోట్ల మంది ప్రజలు తమ ఇళ్ల పై జాతీయ జెండాను రెపరెపలాడించాలని కోరారు. ఇది కేవలం వేడుక మాత్రమే కాకుండా, దేశభక్తిని, ఐక్యతను చాటే గొప్ప సందర్భమని పేర్కొన్నారు. అత్యధిక యువత కలిగిన మన దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చడంలో యువత పాత్ర అత్యంత కీలకమైనదని స్పష్టం చేశారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సోదరభావంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించిన చిన్నారుల స్కేటింగ్ ప్రదర్శనను ప్రత్యేకంగా అభినందించారు. ఆగస్టు 15 వేడుకల్లో భాగంగా కలెక్టర్ చేతుల మీదుగా వీరికి పురస్కారాలు అందజేస్తారని తెలిపారు. ప్రస్తుతం స్కేటింగ్ కి పిల్లలు రోడ్ల పై ప్రాక్టీస్ చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, వి.ఎం.ఆర్.డి.ఏ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన స్కేటింగ్ రింగ్ ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. నగరం లోని కీలక మైన నెహ్రూ చౌక్ జంక్షన్‌లో ప్రత్యేక క్లాక్ టవర్‌ను ఏర్పాటు చేసి, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాగ జగదీష్, ద్వారపూడి పరమేష్, ప్రభుత్వ అధికారులు, అనధికారులు , విద్యార్థులు , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నక్కపల్లి వారపు సంతలో మార్కెట్ యార్డ్ ప్రారంభించిన హోంమంత్రి







**రూ.60 లక్షల హెటిరో సిఎస్ఆర్ నిధులతో నూతన భవనాలు నిర్మాణం**

**నక్కపల్లి, పెన్ సత్తా ఆగస్టు 13:**
మండల కేంద్రం నక్కపల్లి వారపు సంతలో హెటిరో సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించిన నూతన దుకాణ సముదాయాన్ని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. జాతీయ రహదారిని ఆనుకుని ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంతలో సుమారు రూ.60 లక్షల సీఎస్ఆర్ నిధులతో హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీ పక్కా దుకాణ సముదాయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ నక్కపల్లి వారపు సంతకు సుదీర్ఘ చరిత్ర ఉందని ఎన్నోఏళ్లుగా వ్యాపారులు పాకలు వేసుకుని కూరగాయలు, కిరాణా సరుకులు, ఎండుచేపలు తదితర వస్తువులను విక్రయిస్తున్నారన్నారు.వర్షాకాలంలో సంత ప్రాంగణం బురదమయంగా మారడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గత ఏడాది సంభవించిన అగ్ని ప్రమాదంలో సంతలోని పాకలన్నీ దగ్ధమయ్య చిరు వ్యాపారులు కలిసి సమస్యను వివరించడం జరిగిందన్నారు. వారి విజ్ఞప్తి మేరకు వ్యాపారుల సమస్యను పరిష్కరించేందుకు హెటెరో సంస్థ రూ.60 లక్షల సీఎస్ఆర్ నిధులను కేటాయించడం జరిగిందన్నారు.
ఈ నిధులతో మూడు బ్లాకుల్లో మొత్తం 65 దుకాణాలతో పక్కా మార్కెట్ సముదాయాన్ని నిర్మించారు. తాజాగా హోంమంత్రి అనిత ఈ దుకాణ సముదాయాన్ని ప్రారంభించి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. వ్యాపారులు, కొనుగోలుదారులకు ఈ మార్కెట్ సముదాయం 40 ఏళ్ల కల అని అన్నారు. నక్కపల్లి అతిపెద్ద ఎండుచేపల మార్కెట్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. విశాఖపట్నం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మత్స్యకారులు, వ్యాపారులు నక్కపల్లి సంతకు వచ్చి ఎండుచేపల కొనుగోలు, అమ్మకాలు చేస్తుంటారని చెప్పారు. సీఎస్ఆర్ నిధులతో మార్కెట్ సముదాయాన్ని నిర్మించేందుకు సహకరించిన హెటెరో యాజమాన్యాన్ని హోంమంత్రి అనిత అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# నక్కపల్లిలో 100 పడకల ఆసుపత్రికి కృషి చేస్తా





**హోం మంత్రి వంగలపూడి అనిత**

**నక్కపల్లి, పెన్ సత్తా ఆగస్టు 13** : నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆమె వివిధ వార్డులను పరిశీలించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని పిల్లల వార్డును సందర్శించిన హోం మంత్రి చిన్నారులను పరామర్శించి, వారికి బేబీ కిట్లను అందజేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వైద్యులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత ప్రకటించారు. ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. నక్కపల్లి ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ప్రారంభం**

నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహన సేవలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బాలింతతో కలిసి ఆమె వాహనంలో ప్రయాణించారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అడ్డురోడ్డు మీదుగా కోనవానిపాలెం వరకు తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో మంత్రి ప్రయాణించారు. బాలింత లక్ష్మీ దుర్గను, ఆమె బిడ్డను వాహనంలో స్వగ్రామమైన కోనవానిపాలెంకు తీసుకెళ్లి, ఇంటి వద్ద సురక్షితంగా దించారు. ప్రసవానికి ముందు, ప్రసవం అనంతరం తల్లులు, నవజాత శిశువులు ప్రయాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి అనిత తెలిపారు. ఆసుపత్రి నుంచి తల్లీబిడ్డలను సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చడంలో ఈ వాహనాలు కీలకంగా నిలుస్తాయని చెప్పారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఆరోగ్యాంధ్ర దిశగా మరో ముందడుగు అని ఆమె అన్నారు.

# రైతులకు మేలు చేసేందుకే 2515 మందికి డివిడెండ్లు

సొసైటీ అభివృద్దే మా ధ్యేయం

సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ

**తాడేపల్లిగూడెం ఆగస్టు**
సొసైటీలోని రైతులకు మేలు చేసేందుకే 2515 మందికి డివిడెండ్లను ఇస్తున్నట్లు ఆరుగొలను సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన సొసైటీ చైర్మన్ గా పదవి చేపట్టి నేటికీ సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు.గత ప్రభుత్వం సొసైటీ పరిధిలోని రైతులకు డివిడెంట్లు ఇవ్వలేదని,రైతులను ఆదుకునేందుకు ఖచ్చితంగా డివిడెండ్లు ఇచ్చి తీరాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా,తన పదవీకాలం సంవత్సరం పూర్తయిన సందర్భంలో బుధవారం కొంతమంది రైతులకు డివిడెంట్ లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ సొసైటీ పరిధిలో 2515 మంది రైతులకు రూ. 3,66,352 లు డివిడెండ్లుగా అందజేస్తామన్నారు.ఐదు సంవత్సరాలకు డివిడెంట్లు బకాయిలు ఉండగా, ప్రస్తుతం 2021-22 నుంచి 2023-24 మూడు సంవత్సరాలకు గాను సొసైటీ కి వచ్చిన లాభం నుంచి రైతులకు 15% డివిడెండ్లు అందజేస్తున్నామన్నారు. లాభాపేక్ష లేకుండా రైతుల కోరిక మేరకు ఎరువులు,పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిపారు.దండగర్ర ఆరుగొలను తోపాటు కొత్తూరులో నూతనంగా ఎరువుల విక్రయాలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆరుగొలను, దండగరలో దాల్వా కు రూ. కోటి వ్యాపారం జరిగిందన్నారు. సొసైటీ పరిధిలోని పాడి రైతులకు ఉపయోగపడే విధంగా పశువులకు దాణా, కాలుష్యం మాత్రలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.9.5% డిపాజిటర్లకు వడ్డీని ఇచ్చి డిపాజిట్లు సేకరిస్తున్నామన్నారు. వచ్చిన డిపాజిట్ల నుంచి 12% వడ్డీతో రైతులకు ఎరువులు అరువుకిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి కాగానే వారు అప్పు చెల్లిస్తారన్నారు. అనంతరం సొసైటీ వారికి తిరిగి రెండు సదుపాయం కల్పిస్తుందన్నారు.కొత్తూరు నుంచి మద్దింశెట్టి సూర్యనారాయణ, లింగారాయుడు గూడెం నుంచి మైనం శ్రీనివాస్ సొసైటీ డైరెక్టర్లుగా తనకు మంచి సహకారం అందిస్తున్నట్లు. వారి గ్రామాల తరఫున రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెం మానవతా వారి ఆధ్వర్యంలో నిడదవోలు రాజరాజేశ్వరి లయన్స్ రామకృష్ణ కంటి ఆసుపత్రి వారిచే 227 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 117 మంది కి కళ్ళజోళ్ళు పడతాయని వారు తెలిపారని సత్యనారాయణ చెప్పారు.



కళ్ళజోళ్ళు అవసరమైన వారికి చైర్మన్ సత్యనారాయణ స్వయంగా తన సొంత ఖర్చులు రూ. 29,250 లు వెచ్చించినట్లు తెలిపారు. డబ్బు సంపాదించి సాధించింది అంటూ ఏమీ లేదని కొంతమందికైనా నేత్రదానం చేస్తే వాటి నుంచి వచ్చే ఆశీర్వాదాలు తనను తన కుటుంబాన్ని కాపాడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అనధికార ఆర్ఎంపీ లపై చర్యలు ఏవి

జిల్లా వైద్య శాఖ అధికారికి పట్టదా..

న్యాయవాది లంకిశెట్టి బాలాజీ

వారం రోజుల క్రితం కృష్ణాజిల్లా డి. ఎం. హెచ్. ఓ కు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గద్దం రాజు ఫిర్యాదు చేసిన జిల్లా వైద్య శాఖ అధికారి నేటికీ స్పందించకపోవడం అనధికార ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోకపోవడం వైద్య అధికారుల నిర్లక్ష్యం నగర ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని లంకిశెట్టి బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు.
మచిలీపట్నం పరిసర గ్రామ ప్రాంతాలలో కొంతమంది అర్హత లేని వ్యక్తులు ఆర్ఎంపీ బోర్డులు పెట్టుకుని చట్ట వ్యతిరేకంగా వైద్యం చేయటం పట్ల బాలాజీ తీవ్రంగా ఖండించారు. మచిలీపట్నం జవ్వారు పేట కాపురస్తుడుఆదినారాయణ గారి కుమారుడు గద్దం రాజు దాఖలు చేసిన ఫిర్యాదు లో
మచిలీపట్నం రాజుపేట కు చెందిన మహమ్మద్ జానీ అనే వ్యక్తి ఏ విధమైన అర్హతలు లేకుండా వైద్యం చేస్తూ జనాలను మోసం చేస్తూ మచిలీపట్నం కాలేఖాన్ పేట జఫరియా వ్రణ వైద్యశాల పేరుతో పెద్ద ఎత్తున ప్రజలను మోసగిస్తూ వైద్యుడిగా చలామణి అవుతూ సాయి మెడికల్ బి ఫారం షాప్ తన అల్లుడు ద్వారా నడుపుతూ తాను రాసిన మందులను రోగులచే కొనుగోలు చేయించి కోట్ల రూపాయలు సంపాదించాడు అతనికి ఏ విధమైన అర్హత లేదు. రెడ్ క్రాస్ నెంబరు అని రోగులకు ఇంజక్షన్ చేస్తూ మెడికల్ చీటీలు రాస్తూ తన షాపులోనే మెడికల్ షాప్ పెట్టి ప్రజలను మోసగించుచున్నాడు. ఇటీవల సదరు జానీ మహమ్మద్ తన కుటుంబ సభ్యులతో కలిసి ట్రావెల్ ఏజెన్సీ పేరుతో నిరుద్యోగులను మోసగిస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ విధమైన అర్హత లేని సదరు జానీ మహమ్మద్ కాలేఖాన్ పేట
డోర్ నెంబరు 1/519 లో
శ్రీ సాయి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ పేరుతో చట్ట వ్యతిరేకంగా మందులు విక్రయిస్తూ ఏ విధమైన అర్హతలు




లేకుండా వైద్యం చేస్తూ ప్రజలను మోసగిస్తూ దోపిడీ చేస్తున్న జానీ మహమ్మద్ పై తగిన చర్య తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడవలసిందిగా గద్దం రాజు డిమాండ్ చేసి ఉన్నారు సదరు జానీ మహమ్మద్ మచిలీపట్నంలో పెద్ద ఎత్తున ఆస్తులు కొనుగోలు చేసి డోర్ నెంబర్ 5/73,4/620,4/611 మరియు ఇతర ఆస్తుల్ని కొనుగోలు చేసి తన కుటుంబ సభ్యుల పేర్లు పెట్టి ప్రజలను మోసగిస్తున్నాడు కావున తక్షణమే జఫరియా వ్రణ వైద్యశాల ను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా కోరి ఉన్నాడు . రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి గారికి కూడా ఫిర్యాదు పంపిన జిల్లా అధికారులు స్పందించి పోవడం శోచనీయమని బాలాజీ అన్నారు .స్వయంగా డీఎంహెచ్ఓ కి అందజేసిన నేటికీ అనధికారంగా డాక్టర్ గా చలామణి అవుతూ వైద్యం పేరుతో రోగులను దోచుకుంటు న జానీ మహమ్మద్ పై జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకోకపోవడం పై జిల్లా వైద్యాధికారుల పనితీరు ప్రశ్నార్థకంగా ఉందని
లికిత పూర్వ ఫిర్యాదు పై వెంటనే స్పందించి నకిలీ ఆర్ఎంపీ లపై చర్యలు తీసుకోవాలని లంకిశెట్టి డిమాండ్ చేశారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు




విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా వివిధ పోటీలు

ఆటలు, అథ్లెటిక్స్‌తో పాటు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎటపాక మండలం నల్లకుంటలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీలను వైభవంగా ప్రారంభించారు. ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించే ఈ పోటీల ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమేనని హెచ్ఎం తెలిపారు. ఉత్సాహంగా క్రీడా పోటీలు పాఠశాల ఆవరణలో గేమ్స్, అథ్లెటిక్స్‌తో పాటు మ్యూజికల్ చైర్స్ వంటి వినోదాత్మక పోటీలను ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పోటీల సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల కేరింతలు, సందడితో కళకళలాడింది.

సృజనాత్మకతకు పదును

ఆటలతో పాటు విద్యార్థుల ఆలోచనా శక్తికి, సృజనాత్మకతకు పదును పెట్టేలా క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, జాతీయ సమైక్యత వంటి అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా పిజిహెచ్ఎం తాటి సీతారాములు మాట్లాడుతూ... పాఠశాల స్థాయిలో నిర్వహించే ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీతత్వం మరియు దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విజయవంతంగా సాగుతున్న ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

## వారా నానికీ ఘన నివాళులర్పించిన

ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి





పోలవరం గ్రామ పంచాయతీలో వర్కర్‌గా పనిచేస్తున్న వారా నాని ఇటీవల ఏలూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం ఆయన భౌతికకాయాన్ని పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నాని మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం నాని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు.

## ఆకుతీగపాడులో ఇంటింటికి తెలుగుదేశం



**పెంటపాడు ఆగస్టు 13** మండలంలోని ఆకుతీగపాడులో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇన్చార్జ్, ఏపీ భవన్ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామంలోని టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.వలవల బాబ్జి మాట్లాడుతూ కూటమి ఈ రెండేళ్లలో చేసిన అభివృద్ధి,సంక్షేమం ప్రజలకు వివరించాలని టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు.రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ,విద్యాశాఖ మంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.పోలవరం ప్రాజెక్టు,అమరావతి రాజధాని త్వరలోనే పూర్తి చేస్తారని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ రాకతో ఉత్తరాంధ్ర ఉవ్వెత్తున అభివృద్ధి చెందుతుందన్నారు.సామాన్యులకు సైతం విద్యను అందించేందుకుగాను మంత్రి లోకేష్ ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం వర్తించేలా చర్యలు తీసుకున్నారన్నారు.రైతులను ఆదుకునేందుకు 24 గంటల్లోనే నేరుగా వారి ఖాతాల్లోకి నిధులు జమ చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజలకు మేలైన సేవలు అందిస్తున్నారన్నారు. అలాంటిది జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తూ బురద జల్లుతోందన్నారు. అధికార దాహంతో జగన్ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు,దాసరి అప్పన్న,పాతూరి రాంప్రసాద్ చౌదరి,బుద్ధన ధనరాజు,పడాల ఉమాశంకర్,కొల్లూరి నాగరాజు,బుద్ధన అప్పారావు, మొఖమాట్ల శ్రీనివాస్,ఇర్లపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశం స్వాతంత్ర ఉద్యమం గురించి అవగాహన ఉండాలి .

ప్రిన్సిపాల్ పి .లక్ష్మి




**మచిలీపట్నం ఆగస్టు 13** విద్యార్థులు విద్యతో పాటు భారతదేశం స్వాతంత్ర ఉద్యమం గురుంచి అవగాహన కలిగివుండాలి అని ప్రిన్సిపాల్ పి .లక్ష్మి అన్నారు. 80 వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు గురువారం స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు పుర వీధుల్లో భారత్ మాత కి జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్రా లక్ష్మి మాట్లాడుతూ ఆ నాటి స్వాతంత్ర సాధన కోసం ఎందరో ప్రాణాలు త్యాగం చేసారని అన్నారు. నేటి విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకోని భవిష్యత్తుకు బట్టలు వేసుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాధ్ బాబు అధ్యాపకులు సాజిదా సుల్తానా, జ్యోతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు

జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గందరగోళం మధ్య ముగిశాయి. గురువారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాల ముగింపు కూడా అధికార, విపక్షాల మధ్య తీవ్ర రాజకీయ ఘర్షణకు వేదికగా మారింది. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద బీజేపీ, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే జాతీయ గీతం వందేమాతరంలోని మొత్తం 6 చరణాలను ఆలపించారు. ఆ వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా సమావేశాలు ముగిసే రోజున సభ పనితీరును, ఉత్పాదకతను వివరిస్తూ స్పీకర్ చేసే ముగింపు ప్రసంగం ఈసారి జరగలేదు. సభ వాయిదా పడిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో కొద్దిసేపు ఉన్నారు.

ఝార్ఖండ్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ పార్టీ స్పందించడం లేదంటూ బీజేపీ నేతలు ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ మకర్ ద్వార్ వద్ద బీజేపీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. ప్రజా సమస్యలపై విపక్షం బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండగా, సభా కార్యకలాపాలను అడ్డుకోవడానికే ప్రాధాన్యం ఇస్తోందని అధికార పక్షం విమర్శించింది. బీజేపీ నిరసనకు కొద్దిసేపటికే విపక్ష ఎంపీలు కూడా అక్కడే ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేడా నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో ఓ బొమ్మ కోతిని ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. '56 అంగుళాల చిన్న కోతి లోపలికి రా' అంటూ చేసిన నినాదాలు రాజకీయంగా వివాదానికి దారితీశాయి. అధికార పక్ష నేతలు ఈ నిరసన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**'సభ నడపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే'**

సభ సజావుగా సాగకపోవడానికి విపక్షాన్ని నిందించడం సరికాదని ప్రతిపక్షాలు ఎంపీలు అన్నారు. పార్లమెంట్‌ను నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ ఎంపీ సౌగత రాయ్ అని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన వినేందుకు విపక్షం సిద్ధంగా లేదన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఝార్ఖండ్ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరామని, ఎవరి ఆదేశాలతో పెల్లెట్ గన్ కాల్పులు జరిగాయో చెప్పాలని డిమాండ్ చేశామని తెలిపారు. కానీ ప్రభుత్వం నుంచి సరైన



వివరణ రాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా కూడా సభ వాషౌట్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. గత 20 రోజులుగా పార్లమెంట్‌లో ఉండి సమస్యలపై చర్చకు ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశాలు ముగియడానికి చివరి రోజు మాత్రమే కేంద్ర హోంమంత్రి చర్చకు సిద్ధమని చెప్పడం వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీశారు.

**విపక్షమే సభను అడ్డుకుందని బీజేపీ ఆరోపణ**

మరోవైపు అధికార పక్షం కూడా విపక్ష ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనే సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ, పార్లమెంటరీ వ్యవస్థ ప్రకారం సభ నడుస్తుందని, దానిని ఎవరి వ్యక్తిగత వ్యవహారంలా మార్చలేరని అన్నారు. రాహుల్ గాంధీ తన రాజకీయ ప్రభావంతో వరుసగా కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి రాజీనామా చేయాల్సి వస్తుందని భావించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు వ్యవస్థ ప్రకారమే జరుగుతాయని చెప్పారు.

**వరుస అంతరాయాలతోనే సమావేశాలు**

ఈసారి వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభలో తరచూ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. అధికార, విపక్షాల ఆందోళనలతో సభలు దద్దరిల్లాయి. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్, అయోధ్య విరాళాల చోరీ వంటి అంశాలపై నిరసిస్తూ ప్రతిపక్షాలు సభను అడ్డుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులపై లాఠీచార్జ్ ఘటనపై హోంమంత్రి అమిత్ షా జవాబు చెప్పాలని విపక్షాలు చేసిన డిమాండ్ సభను కుదిపేసింది. మరోవైపు ఝార్ఖండ్ నిరసనలపై రాహుల్ గాంధీ స్పందించాలంటూ బీజేపీ ఎంపీలు నిరసనలు చేశారు. సభ లోపలే కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలోనూ ఇరు పక్షాలు పరస్పర నిరసనలకు దిగాయి. చివరి రోజు కూడా అదే పరిస్థితి కొనసాగడంతో సభలు నిరవధిక వాయిదా వేశారు. దీంతో చర్చలు, రాజకీయ ఆరోపణలు, నిరసనల మధ్య సాగిన వర్షాకాల సమావేశాలకు అధికారికంగా తెరపడింది. అయితే గురువారం చివరిరోజు కావడంతో అమిత్‌షా ఈ అంశంపై సమాధానం చెబుతారని అంతా భావించారు. ఆయన కూడా విపక్షాల ప్రతీ ప్రశ్నకూ సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు బుధవారం ప్రకటించారు. అందుకు సమయం కేటాయించాలని స్పీకర్‌ను సైతం కోరారు. అయినప్పటికీ, సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

# ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఒక జోకర్ల గుంపు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బీజేపీపై గురువారం విరుచుకుపడ్డారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్?కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనలను ప్రభుత్వం అణచివేసిన తీరుపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ బాధను వ్యక్తం చేయాలని విద్యార్థులు అనుకుంటుంటే, ఆ ప్రభుత్వం మాత్రం నిబంధనల పేరుతో వారి గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని అధికార పక్షం కేవలం కొద్దిమంది వ్యక్తులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే విధంగా దేశంపై ఒక కఠినమైన వ్యవస్థను బలవంతంగా రుద్దడమే వారి రాజకీయ తత్వమని దుయ్యబట్టారు. గురువారం దిల్లీలో జరిగిన 'రచనాత్మక కాంగ్రెస్ జాతీయ సదస్సు'లో ఆయన మాట్లాడారు.

**అధికార పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ సిద్ధాంతం**

అయితే, అధికార పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ సిద్ధాంతం ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశ ప్రజలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న నిబంధనలను కాంగ్రెస్ పార్టీ బద్దలు కొడుతుందని వ్యాఖ్యానించారు. నాలుగేళ్ల క్రితం ఉత్తరాఖండ్‌లో అత్యాచారానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఓ యువతి తల్లి తనను కలిసి కన్నీరు పెట్టుకుందని రాహుల్ గుర్తుచేసుకున్నారు. బాధితురాలు తన ఆవేదనను వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తుంటే, ప్రస్తుత వ్యవస్థ మాత్రం ఆమెను మాట్లాడనివ్వడం లేదు మండిపడ్డారు. ఆమె మాట్లాడితే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని




అంటున్నారు. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ దౌత్య విధానంపై రాహుల్? తీవ్ర విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ నాయకులను కౌగిలించుకోవడం కాకుండా దేశ ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ పని అని హితవు పలికారు. కేవలం స్నేహం, బహిరంగ ఆత్మీయ ప్రదర్శనలపై ఆధారపడకుండా, అంతర్జాతీయ సంబంధాలకు జాతీయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలిపారు.

"కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు కలిసి తమ గళాన్ని వినిపించడం ప్రారంభించాయి. ఇక దీన్ని ఎవరూ ఆపలేరు. నరేంద్ర మోదీ రాజీనామా చేసి, అమిత్ షా పదవి నుంచి తప్పుకునే వరకు మేం వదిలిపెట్టం. చివరికి వారు 'మమ్మల్ని క్షమించండి, మమ్మల్ని వదిలేయండి' అని అంగీకరించి చేతులెత్తేసే వరకు మేం వారిని నిద్రపోనివ్వం. అయితే, ఇదంతా ద్వేషం, హింస లేకుండా ప్రజాస్వామ్య బద్ధంగానే ఎదుర్కొంటాం. దేశ విలువలు, సంస్కృతి కోసం మావంతు ఈ పోరాటం చేస్తున్నాం. మన దేశం, ఆప్యాయత, ప్రేమ, సోదరభావం, అహింస కలిగిన దేశం. ఈ విషయాన్ని మేం అందరికీ నిరూపిస్తాం."

**ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ కీలక వ్యాఖ్యలు**

మరోవైప, రాష్ట్రీయ స్వయం సేవక్? సంఘ్?(ఆర్ఎస్ఎస్)పై కూడా రాహుల్? ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆర్?ఎస్?ఎస్? నాయకులకు ప్రస్తుత భారతదేశంపై ఎలాంటి అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గతంలో మనం బ్రిటిష్ సామ్రాజ్యంతో పోరాడామని, కానీ ప్రస్తుతం మనం పోరాడుతున్నది మన దేశ చరిత్ర, సిద్ధాంతాలపై కనీస అవగాహన లేని కొందరు జోకర్లతో అని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని అర్థం చేసుకోవాలంటే 3,000 ఏళ్ల నాటి విషయాలు కాదు, ప్రస్తుత భారతదేశాన్ని, ఇక్కడి ప్రజల భావాలను అర్థం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. ఒకప్పుడు ఆర్ఎస్ఎస్ అంటే దేశంలోని చిన్న వ్యాపారులు, స్వర్ణకారులు, నగల వ్యాపారులకు ప్రాతినిధ్యం వహించారని రాహుల్ పేర్కొన్నారు. కానీ ఆ కాలం నాటి ఆర్ఎస్ఎస్ ఎప్పుడో కనుమరుగు అయిపోయిందని అన్నారు. ప్రస్తుత ఆర్ఎస్ఎస్ పూర్తిగా రూపాంతరం చెంది పెద్ద పెద్ద కార్పొరేట్ శక్తులు, బడా పెట్టుబడిదారుల చేతుల్లో ఒక సాధనంగా మారిపోయిందని ఆరోపించారు. చేతుల్లో కర్రలు పట్టుకుని తిరుగుతూ వారు తమను తాము హాస్యాస్పదంగా మార్చుకుంటున్నారని దుయ్యబట్టారు.

# 'చైనా ముప్పు'ను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో అభివృద్ధి మంత్రం

సరిహద్దు గ్రామాలు అంటే ఒకప్పుడు దేశ పటంలో చివరి అంచున ఉన్న ప్రాంతాలుగానే చూసేవారు. అక్కడికి రోడ్లు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక వసతులు చేరడమే పెద్ద సవాలుగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. దేశ సరిహద్దులోని గ్రామాల్ని చివరి గ్రామాలుగా కాకుండా, దేశపు తొలి గ్రామాలుగా చూడాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల్ని చేపడుతోంది. కానీ సరిహద్దు గ్రామాలకు రోడ్లు, భవనాలు, విద్యుత్ అందిస్తేనే అక్కడి ప్రజలు ఆగిపోతారా? ఉపాధి లేకపోతే యువత తిరిగి నగరాలవైపు వెళ్లిపోరా? ఈ ప్రశ్నలకు అరుణాచల్ ప్రదేశ్‌లోని రెండు సరిహద్దు ప్రాంతాలు రెండు భిన్నమైన సమాధానాల్ని చూపిస్తున్నాయి. ఒకవైపు అభివృద్ధితో మారుతున్న తవాంగ్ జిల్లాలోని జెమితాంగ్; మరోవైపు మౌలిక వసతులు ఉన్నా ప్రజల వలసలతో వెలవెలబోతున్న లిమేకింగ్ తక్సింగ్.

చైనాతో అత్యంత సున్నితమైన సరిహద్దును పంచుకుంటున్న అరుణాచల్ ప్రదేశ్‌లో స్థానికుల వలసల్ని అడ్డుకోవడం, సరిహద్దు గ్రామాల్ని మౌలిక వసతులతో బలోపేతం చేయడం, వాటిని ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చడం, లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్‌లో 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్ (ఎవ్వీపీ)' ను ప్రారంభించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా- అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల 'కిబిథూ' గ్రామం నుంచి ఈ కార్యక్రమాన్ని లాంచ్ చేశారు. 2026 ఫిబ్రవరి 20న అసోంలోని సరిహద్దు గ్రామం నుంచి రెండో విడతను కూడా విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవం వేళ అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లోని 'జెమితాంగ్', 'లిమేకింగ్- తక్సింగ్' గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందో ఈటీవీ భారత్ అందిస్తున్న ప్రత్యేక కథనం. అరుణాచల్ ప్రదేశ్ దేశంలోనే అత్యంత కీలకమైన సరిహద్దు రాష్ట్రం. ఇది చైనాతో సుమారుగా 1080 నుంచి 1200 కిలోమీటర్ల మేర సరిహద్దును (మెక్ మోహన్ లైన్) పంచుకుంటోంది. చైనా ఎప్పటికప్పుడు అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు తమవేనని, దానిని దక్షిణ టిబెట్ అని పిలుస్తూ వివాదాలు సృష్టిస్తూ ఉంటుంది. అయితే భారత్ మాత్రం చైనా బెదిరింపుల్ని తిప్పికొడుతూ, అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలోని అంతర్భాగమేనని స్పష్టం చేస్తోంది. చైనా ఆక్రమణల్ని అడ్డుకోవాలంటే సైన్యంతో పాటు సరిహద్దు గ్రామాల్లో ప్రజలు నివసించడం కూడా చాలా ముఖ్యం. అందుకే సరిహద్దు గ్రామాల్ని ఖాళీ కాకుండా చూడటం కూడా భద్రతా వ్యూహంలో భాగంగా మారింది.

**జెమితాంగ్ సక్సెస్ స్టోరీ**

పశ్చిమ అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లాలో ఉన్న జెమితాంగ్ గ్రామం చైనా సరిహద్దుకు చాలా దగ్గరగా ఉంటుంది. ఇక్కడ భారత్ చేపట్టిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. వైబ్రెంట్ విలేజెస్ పథకం కింద ఇక్కడ అద్భుతమైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా ఇక్కడ రవాణా వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు ఆర్మీ పోస్టులకు లేదా వేరే ఊళ్లకు వెళ్లాలంటే గంటల తరబడి కొండల్లో నడవాల్సి వచ్చేది. ఇంకా ప్రాణాలకు తెగించి ప్రమాదకరమైన వంతెనలు దాటాల్సి ఉండేది. కానీ ఇప్పుడు చూస్తే వాహనాలు నేరుగా చివరి ప్రాంతం వరకు వెళు న్నాయి. రోడ్లు, విద్యుత్, తాగునీరు, వైద్యం వంటి సదుపాయాలు అందుబాటులోకి రావడంతో రోజువారీ జీవితం కూడా సులభమైంది. ఇక్కడ భారత సైన్యం కేవలం సరిహద్దు కాపలాకే పరిమితం కాలేదు. ఆపరేషన్ సద్భావ్ కింద ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, తాగునీటి సదుపాయాలు కూడా కల్పిస్తోంది. ఐటీబీపీ బలగాలు ప్రజలతో పాటు వారి పశువులకు కూడా వైద్యం అందిస్తున్నాయి. ప్రసిద్ధ గొర్సమ్ చోర్టెన్ స్థూపం, జెమితాంగ్ లోయ అందాలు పర్యటకుల్ని ఆకట్టుకుంటున్నాయి. స్థానిక మహిళలు 'కొమోస్ కేఫ్' పేరుతో కేఫ్ నిర్వహిస్తూ తమకంటూ ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. ఈసారి ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా స్టాల్స్ కూడా ఏర్పాటు చేసి మోమోస్, నూడుల్స్, చౌమిన్, రాగులతో చేసిన పదార్థాల్ని కూడా అమ్మడానికి సిద్ధమవుతున్నారు. ఏటా జరిగే గొర్సమ్ ఉత్సవం సైన్యానికి, స్థానిక ప్రజలకు మధ్య అనుబంధాన్ని మరింత పెంచుతోంది.

**మేకింగ్- తక్సింగ్‌లో మరో పరిస్థితి!**

జెమితాంగ్‌లో అభివృద్ధి కనిపిస్తుంటే తూర్పున ఉన్న అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని లిమేకింగ్ - తక్సింగ్ ప్రాంతం మాత్రం మరో వాస్తవాన్ని చూపిస్తోంది. ఇక్కడ స్వాతంత్ర్య దినోత్సవం సందడి కాస్త తగ్గింది. ఒకప్పుడు ఆగస్ట్ 15 వస్తే ఇక్కడ పండగ వాతావరణం ఉండేది. బ్యాండ్ మేళాలు, ఆటల పోటీలు, పరేడ్‌లు కూడా జరిగేవి. సైనికులు, అధికారులు, ఊరి జనమంతా ఉత్సాహంగా పాల్గొనేవారు. కానీ ఇప్పుడు అక్కడ జనం పెద్దగా లేక ఉత్సాహం కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో ఇంకా 3 మిడిల్ స్కూళ్లు, 11 ప్రైమరీ స్కూళ్లు, కమ్యూనిటీ హాళ్లు, బ్యాడ్మింటన్ కోర్టులు ఉన్నాయి. కానీ వాటిని ఉపయోగించే ప్రజల సంఖ్య తగ్గిపోతోంది. చదువు, ఉద్యోగాల కోసం యువత గ్రామాల్ని వదిలి వెళ్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోసం పూర్తిస్థాయి ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు రాగా, అందులో మొదటిగా 16 మందిని సెర్చ్ కమిటీ షార్ట్‌లిస్ట్ చేసింది. ఇప్పుడు ఆ పదహారు మంది నుంచి ముగ్గురి పేర్లను ఎంపిక చేసి, సెర్చ్ కమిటీ తమకు పంపుతుందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. "షార్ట్ లిస్ట్ చేసిన పదహారు మంది అభ్యర్థుల పనితీరును సమీక్షించి, సెర్చ్ కమిటీ ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఆ అభ్యర్థుల జాబితాను తగిన సమయంలో ట్రస్టుకు తెలియజేస్తుంది. దీనిపై ట్రస్ట్ తుది నిర్ణయాన్ని ప్రకటిస్తుంది" అని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది.

**ఇంటర్వ్యూలు**

రిటైర్డ్ జస్టిస్ పర్మోద్ కోహ్లీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వీకే చతుర్వేది, అణుశాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ హవ్రేలతో కూడిన సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రాంగణంలో ఆగస్టు 11, 12 తేదీల్లో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సెర్చ్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం, సీఈఓ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,877 మంది అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన కవర్ లెటర్స్ (సీవీ) సమర్పించారు. నమొదటి దశలో నిర్వహణ సామర్థ్యం, భారీ స్థాయి కార్యక్రమాలను, సిబ్బందిని నిర్వహించడంలో అనుభవం, వ్యక్తిగత నైపుణ్యం, భాషా ప్రావీణ్యం, భవిష్యత్తు దృక్పథం, వ్యూహాత్మక ప్రణాళిక వంటి అంశాల ఆధారంగా అభ్యర్థులను వడపోశారు. రెండో దశలో అభ్యర్థులు సమర్పించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సుమారు 111 మంది అభ్యర్థులను ఆన్?లైన్?లో ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. వారి కమ్యునికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన అనుభవం, దృక్పథం, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను ఇందులో అంచనా వేశారు. మూడో దశలో ముఖాముఖి ఇంటర్వ్యూల కోసం 16 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ ఫైనలిస్టుల్లో ఆర్మీలో పనిచేసిన మాజీ సైనికులు, పదవీ విరమణ చేసిన ఐఏఎస్, ఐపీఎస్? అధికారులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసిన నిపుణులు సహా విభిన్న నేపథ్యాలకు చెందిన నిష్ణాతులున్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన సంస్థకు ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పారదర్శకంగా ఎంపిక చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని కమిటీ పేర్కొంది.

**మూడేళ్ల కాంట్రాక్ట్**

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు. పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం ఉంది. అయితే ఈ పదవికి సంబంధించిన జీతం, ఇతర ప్రయోజనాలను చర్చల ద్వారా నిర్ణయిస్తారు. ట్రస్ట్ ప్రత్యక్ష నిర్వహణలో పనిచేస్తూ, సీఈఓ పరిపాలన బాధ్యతలు నిర్వహిస్తారు. ఆర్థిక విషయాల్లో పారదర్శకతను పాటిస్తారు. ప్రభుత్వ ఏజెన్సీలతో భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేస్తారు. మతపరమైన ఆచారాలు, పండుగలను పర్యవేక్షిస్తారు. భక్తుల భద్రతను, సౌకర్యాలను చూసుకుంటారు. విశిష్ట అతిథుల కోసం ఏర్పాట్లు చేస్తారు. ట్రస్ట్ రోజువారీ కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాలు చోరీకి గురయ్యాయని, కానుకల నిర్వహణలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వహణ కోసం ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ)ను నియమించాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక ప్రక్రియ చేపట్టింది. కాగా, అయోధ్య రామమందిర విరాళాల చోరీపై జూన్?లో ఎఫ్?ఐఆర్? నమోదైంది. ఇప్పటి వరకు ఈ కేసులో కనీసం 8 మందిని అరెస్టు చేశారు.

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు

దేశవ్యాప్తంగా పెరుగుతున్న కేసుల పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కోర్టులు, కాలపరిమితితో కూడిన విచారణలు అవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అయితే అన్ని రకాల కేసులకు ఒకే కాలపరిమితిని నిర్ణయించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కేసుల స్వభావాన్ని బట్టి తగిన సమయాన్ని నిర్ణయించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ పలు కీలక అంశాలపై మాట్లాడారు.

**ప్రతి కేసుకూ ఒకే గడువు కాదు**

దేశంలోని న్యాయస్థానాల్లో కేసుల పెండింగ్ కొనసాగుతుండటం పెద్ద సవాలేనని సీజేఐ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నుంచి జిల్లా, సెషన్స్ కోర్టుల వరకు ఈ సమస్య ఉందన్నారు. న్యాయవ్యవస్థలో ఇప్పటికే అనేక మార్పులు వచ్చినప్పటికీ ప్రతి కేసు నిర్ణీత సమయంలో త్వరగా పరిష్కారం కావాలన్న ప్రజల ఆకాంక్ష సమంజసమేనని చెప్పారు. అయితే ప్రతి కేసుకు ఒకే కాలపరిమితిని వర్తింపజేయడం సాధ్యం కాదన్నారు. కేసుల స్వభావం, సంక్లిష్టత, అంశాల ఆధారంగా విచారణకు అవసరమైన సమయం మారుతుందని వివరించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల ఆధారంగా కేసులకు తగిన కాలపరిమితులను నిర్ణయిస్తామని తెలిపారు.

**ప్రత్యేక కోర్టులతో వేగవంతమైన తీర్పులు**

కేసుల పరిష్కారంలో ప్రత్యేక కోర్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీజేఐ అన్నారు. ప్రభుత్వ సహకారంతో తీవ్రమైన నేరాలకు సంబంధించిన విచారణల కోసం ఏడాది వ్యవధిలోనే ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయగలిగామని చెప్పారు. వివాహ, కుటుంబ వివాదాల కోసం ఫ్యామిలీ కోర్టులు, వాణిజ్య వివాదాల కోసం కమర్షియల్ కోర్టులు, వివిధ అంశాలపై ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకే రకమైన కేసులను ఆయా అంశాల్లో నైపుణ్యం కలిగిన న్యాయస్థానాలు విచారిస్తే వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. భిన్న రకాల కేసులను ఆయా రంగాల్లో నిపుణత కలిగిన కోర్టులు నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**న్యాయమూర్తుల సంఖ్య పెరగాలి**

కేసుల పెండింగ్‌ను పూర్తిగా తగ్గించడంలో న్యాయవ్యవస్థ ఇంకా పూర్తి విజయం సాధించలేదని సీజేఐ అంగీకరించారు. న్యాయమూర్తుల నియామకాలు, ముఖ్యంగా జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన అవసరం వంటి అంశాలు దీనికి కారణమని చెప్పారు. తాను సీజేఐగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కేసుల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే 'డాకెట్ మేనేజ్‌మెంట్'పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా భారీ ప్రభావం చూపే, అత్యంత కీలకమైన కేసులను ముందుగా పరిష్కరించే విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ ధర్మాసనాల ఏర్పాటు, ఒకే తరహా కేసులను సమూహాలుగా విచారించడం ద్వారా పెండింగ్‌ను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

**న్యాయమూర్తికి సహాయకారిగానే!**

న్యాయవ్యవస్థలో సాంకేతికత వినియోగాన్ని పెంచుతున్నప్పటికీ అది న్యాయమూర్తి స్థానాన్ని భర్తీ చేయకూడదని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయాధికారులు యాంత్రికంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి రాకూడదన్నారు. టెక్నాలజీని న్యాయమూర్తికి సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగించాలి తప్ప సాంకేతికతే తీర్పు చెప్పే స్థాయికి వెళ్లకూడదని పేర్కొన్నారు. రాష్ట్రాలు లేదా నిర్దిష్ట ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే విధానంపైనా సీజేఐ స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రభావం చూపే అంశాలను సుప్రీంకోర్టు విచారించవచ్చని కానీ ఒక రాష్ట్రం లేదా నిర్దిష్ట ప్రాంతానికి సంబంధించిన అంశాలను ముందుగా సంబంధిత హైకోర్టు ముందు ఉంచాలని సూచించారు. భారత రాజ్యాంగంలో హైకోర్టులకు అత్యంత కీలకమైన స్థానం ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు, ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు రాజ్యాంగపరమైన అధికారాలు ఉన్నాయని వివరించారు. కొన్ని అంశాల్లో ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు ఉన్న అధికార పరిధి ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు ఉన్న పరిధి కంటే విస్తృతంగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు న్యాయం వారి ప్రాంతానికి దగ్గరగా అందాలనే ఉద్దేశంతోనే ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఉండేలా రాజ్యాంగ నిర్మాతలు వ్యవస్థను రూపొందించారని సీజేఐ అన్నారు. జిల్లా కోర్టులో పరిష్కరించాల్సిన కేసు జిల్లా కోర్టుకే, హైకోర్టుకు సంబంధించిన కేసు హైకోర్టుకే, సుప్రీంకోర్టుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టుకే వెళ్లేలా రాజ్యాంగ వ్యవస్థను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily
శుక్రవారం 14 ఆగస్టు 2026

## సంపాదకీయం

# ఇక.. సాకులు సాగవు!

జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అక్రమాలపై యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సోమవారం వేలాది విద్యార్థులు, ఉద్యోగార్థులు రాంచీలోని రాష్ట్ర శాసనసభ వైపు కదిలినప్పుడు పోలీసులు వాటర్ కెనాన్లు, బాష్పవాయు గోళాలు, లాఠీచార్జితో నిలువరించారు. జగన్నాథ్‌పూర్ ఆలయం సమీపంలోని చివరి బారికేడ్‌ను చేరుకున్న వేలాది యువకులు, తిరంగా జెండాలు, "జేఎస్‌ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షలను రద్దు చేయండి లేదా సీబీఐ దర్యాప్తు జరపండి" వంటి ప్లకార్డులతో బారికేడ్లను ఛేదిస్తూ ముందుకు సాగారు. మొదట్లో పోలీసులు వాటర్ కెనాన్లు ప్రయోగించగా, ఆందోళనకారులు తిరంగా ఊపుతూ నృత్యాలు చేస్తూ ధిక్కారం ప్రదర్శించారు. అయితే పరిస్థితి చేయిదాటిపోయే సూచనలు కనిపించడంతో పోలీసులు లాఠీచార్జికి దిగారు. ఆందోళనకు నేతృత్వం వహిస్తున్న దేవేంద్రనాథ్ మహతో సహా అనేకులు గాయపడ్డారు. ఆగస్టు 2నుంచి నిరాహారదీక్ష చేస్తున్న మహతో, తొమ్మిది రోజులుగా ఆకలితో ఉన్నా అంబులెన్స్‌లోనే ర్యాలీలో పాల్గొన్నారు. "శాంతియుత నిరసనపై లాఠీచార్జి అనాగరికం" అని ఆందోళనకారుల్లో ఒకరైన పీయూష్ కుమార్ వ్యాఖ్యానించారు. కొంతమంది అల్లరిమూకలు బారికేడ్లు బద్దలుకొట్టి పోలీసులపై రాళ్లు రువ్వడంతో ముగ్గురు పోలీసులు గాయపడ్డారని రాంచీ ఎస్పీ పరస్ రానా మీడియాకు వెల్లడించారు. ఈ పరిణామంపై రాహుల్ గాంధీ స్పందిస్తూ, విద్యార్థులపై బలప్రయోగం తప్పని, శాంతియుత నిరసన తెలిపే హక్కు వారికి ఉందని, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని అభిప్రాయపడటం విశేషం. జార్ఖండ్‌లో అధికార సంకీర్ణంలో కాంగ్రెస్ కూడా భాగస్వామి. విద్యార్థుల ఆందోళనపై రాహుల్ 'మౌనం'పై బీజేపీ చేస్తున్న విమర్శలకు ఈ వ్యాఖ్యలు కొంత గాలి తీసేసినట్టయ్యింది.

ఈ ఆందోళన వెనుక ఉన్న అసలు సమస్య 14వ జేపీఎస్‌సీ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలపై లేవనెత్తిన అనుమానాలతో మొదలైంది. అనంతరం జేపీఎస్‌సీ, జేఎస్‌ఎస్‌సీల పనితీరులో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలన్న డిమాండ్‌గా విస్తరించింది. వాస్తవానికి ఇది కొత్త సమస్య కాదు. 2024 సెప్టెంబర్‌లో నిర్వహించిన జేజీజీఎల్‌సీసీఈ పరీక్షలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు అప్పటినుంచీ పోరాడుతున్నారు. 3.04 లక్షలమంది హాజరైన పరీక్షలో అక్రమాలపై లిఖితపూర్వక, పెన్‌డ్రైవ్, సీడీ రూపాల్లో ఆధారాలు సమర్పించినట్టు అభ్యర్థుల నాయకుడు మనోజ్ యాదవ్ ఆరోపించారు. అయితే, తాము సమర్పించిన సీడీలో ఏమీలేదని, అది ఖాళీగా ఉందని జేఎస్‌ఎస్‌సీ అధికారులు బదులివ్వడం విద్యార్థుల ఆగ్రహాన్ని మరింత రేకెత్తించింది. అదే ఏడాది డిసెంబర్‌లో డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియను అడ్డుకునేందుకు యత్నించిన అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేసి, మహతోను అదుపులోకి తీసుకున్నారు కూడా. ఇంతటి సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం ఇన్నాళ్లూ నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రతిసారీ తాత్కాలిక చర్యలు, విచారణ కమిటీలతో సరిపెట్టి, మూలసమస్యను పరిష్కరించకుండా వాయిదా వేయడమే ప్రభుత్వ వైఖరిగా కనిపిస్తోంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సోమవారమే జేపీఎస్‌సీ మాజీ చైర్‌పర్సన్ ఎల్. ఖియాంగ్తేను నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై జార్ఖండ్ సీఐడీ అరెస్టు చేసింది. ఈ కుంభకోణంలో ఆయన పాత్రపై అధికారులకు గత కొద్ది రోజుల్లోనే అనుమానం వచ్చిందా? అది కూడా ఆందోళన జాతీయ వార్తల్లోకి వచ్చిన తర్వాతేనా అన్నది ప్రశ్నార్థకమే. ఇది కేవలం యాదృచ్ఛికమా, లేక ఆందోళన తీవ్రతను తగ్గించేందుకు హడావిడిగా తీసుకున్న చర్యనా అన్నది స్పష్టం కావాల్సి ఉంది. యువత కెరీర్లు, జీవితాలపై ఇంతటి నిర్లక్ష్య వైఖరి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నియామక పరీక్షలు కేవలం పరిపాలనాపరమైన తంతు కాదు. వేలాది యువకులకు అవి ఏళ్ల తరబడి చేసిన సన్నద్ధత, ఆర్థిక త్యాగం, స్థిరమైన భవిష్యత్తు కోసం పెంచుకున్న ఆశలకు ప్రతీక. మధ్యతరగతి, గ్రామీణ కుటుంబాల్లో ఒక్కో అభ్యర్థి వెనుక తల్లిదండ్రుల కష్టార్జితం, అప్పులు చేసి కోచింగ్ ఫీజులు కట్టిన త్యాగాలు దాగి ఉంటాయని మర్చిపోకూడదు.

ఏదైనా అక్రమం, జాప్యం, పేపర్ లీక్ లేదా తారుమారు జరిగితే, దాని పరిణామాలు ఒక్క పరీక్షకే పరిమితం కావు. అభ్యర్థులను మరో అనిశ్చిత చక్రంలోకి నెట్టివేస్తాయి, ప్రజా వ్యవస్థలపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి, కుటుంబాలపై మానసిక, ఆర్థిక భారాన్ని మోపుతాయి. ఒక్కసారి పరీక్ష రద్దయితే, మళ్లీ కొత్తగా సన్నద్ధం కావడం, మరో ఏడాది వేచి చూడటం, అప్పటికే వయోపరిమితి దాటిపోయే ప్రమాదం ఎదుర్కోవడం వంటి పరిణామాలు అభ్యర్థుల జీవితాలను తలకిందులు చేస్తాయి. కాబట్టి జార్ఖండ్ ప్రభుత్వం కేవలం నష్టనివారణ చర్యలకే పరిమితం కాకుండా, ప్రతి ఆరోపణపైనా పారదర్శకంగా, కాలపరిమితితో కూడిన దర్యాప్తు చేపట్టాలి. తప్పు చేసినవారు ఎంతటి పలుకుబడి కలిగినవారైనా, రాజకీయంగా ఎంత సన్నిహితులైనా, తమ నేరపూరిత ప్రమేయానికి బాధ్యత వహించాల్సిందే. అదే సమయంలో, నష్టపోయిన అభ్యర్థులకు అస్పష్టమైన హామీలు కాకుండా, స్పష్టమైన సమాచారం, విశ్వసనీయమైన కాలవ్యవధి, న్యాయమైన పరిష్కారాలు అందించాలి. ఇవి కూడా జెన్-జీని పూర్తిగా సంతృప్తిపరచకపోవచ్చు, కానీ ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించడానికి ఇది కనీస అవసరం.

సమస్య పరిష్కారం కావాలంటే, పార్టీలకు అతీతంగా, రాజకీయ ప్రయోజనాలను పక్కనబెట్టి, యువత న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు నిజాయితీతో కూడిన కృషి జరగాలి. కేవలం రాంచీలోనే కాదు, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఇలాంటి నియామక పరీక్షల అక్రమాలు యువతలో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నాయి. బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోనూ ఇటీవలి సంవత్సరాల్లో ఇలాంటి ఆందోళనలు తలెత్తడం, పరీక్షల విశ్వసనీయతపై యువతలో పెరుగుతున్న అపనమ్మకానికి నిదర్శనం. జార్ఖండ్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లోని అధికారులు కూడా ఇలాంటి వివాదాలు పునరావృతం కాకుండా నివారణ చర్యలను వ్యవస్థాగతంగా రూపొందించుకోవాలి. సాంకేతికత సాయంతో పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఫలితాల ప్రకటనలో జాప్యాన్ని నివారించడం వంటి దీర్ఘకాలిక సంస్కరణలు అవసరం. యువత కోరుతున్నది కేవలం ప్రతిభ ఆధారిత, పారదర్శకమైన నియామక వ్యవస్థ మాత్రమే. ఈ న్యాయమైన డిమాండ్‌ను నిర్లక్ష్యం చేసే ఏ ప్రభుత్వమైనా, రాబోయే రోజుల్లో మరింత తీవ్రమైన యువ ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదు!

## పనికొచ్చే పలుకు



# జీర్ణ వ్యవస్థను పట్టించుకోవాలి..

శరీరాన్ని ఒక ఇంటితో పోల్చుకుంటే, జీర్ణవ్యవస్థ దాని పునాది లాంటిది. పునాది గట్టిగా లేకుండా ఇంటికి రంగులు వేయడం, తలుపులు అలంకరించడం ఎంత అర్థరహితమో, జీర్ణవ్యవస్థను నిర్లక్ష్యం చేస్తూ మెటబాలిజాన్ని మెరుగుపరచుకోవాలని ప్రయత్నించడం కూడా అంతే వ్యర్థం. చాలామంది బరువు తగ్గాలని, శక్తివంతంగా ఉండాలని కొత్త డైట్లు, సప్లిమెంట్లు, ఫ్యాడ్ వర్కౌట్లు వెతుక్కుంటూ పరుగులు తీస్తారు. కానీ వీటన్నింటి ప్రభావం ఆధారపడేది ఒక్క -మీ జీర్ణవ్యవస్థ ఎంత ఆరోగ్యంగా పనిచేస్తోంది అన్నదానిపైనే. తినే ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే, ఎంత పోషకాహారం తీసుకున్నా శరీరం దాన్ని సరిగ్గా ఉపయోగించుకోలేదు.

జీర్ణవ్యవస్థ కేవలం ఆహారాన్ని జీర్ణం చేసే యంత్రం మాత్రమే కాదు. ఇది శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలను, హార్మోన్ల సమతుల్యతను, రోగనిరోధక శక్తిని నియంత్రించే కీలక కేంద్రం. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థలో అత్యధిక భాగం జీర్ణాశయంలోనే ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. అంతేకాదు, మెదడుకు, జీర్ణవ్యవస్థకు మధ్య నిరంతర సంభాషణ జరుగుతూనే ఉంటుంది. -దీన్నే 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అంటారు. ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలు తరచూ జీర్ణవ్యవస్థ అసమతుల్యత నుంచే మొదలవుతాయని ఆధునిక వైద్యశాస్త్రం నిర్ధారిస్తోంది. అందుకే, జీర్ణవ్యవస్థను నిర్లక్ష్యం చేసి కేవలం బాహ్య లక్షణాలను -బరువు, అలసట, చర్మ సమస్యలు మాత్రమే సరిచేయాలని ప్రయత్నించడం, మూలాలు వదిలేసి పైపైన మందు వేయడం లాంటిదే.

పురాతన గ్రీకు వైద్యుడు హిప్పోక్రటీస్‌కు అంటగట్టబడిన ఒక ప్రసిద్ధ వాక్యం ఇక్కడ గుర్తుచేసుకోవాలి: *All disease begins in the gut.* (అన్ని రోగాలూ మొదలయ్యేది జీర్ణాశయం నుంచే). ఈ ఖచ్చితమైన వాక్యం హిప్పోక్రటీస్ రచనల్లో ప్రత్యక్షంగా కనిపించకపోయినా, రెండువేల ఏళ్లుగా ఆయనకు ఆపాదిస్తూ వస్తున్న ఈ భావన వెనుక ఉన్న సారాంశాన్ని ఆధునిక శాస్త్రం మరింత బలపరుస్తోంది. జీర్ణాశయంలోని మంచి బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతింటే, అది కేవలం అజీర్ణానికే పరిమితం కాకుండా, స్థూలకాయం, మధుమేహం, హృద్రోగాలు, మానసిక సమస్యల వరకూ దారితీయవచ్చని పరిశోధనలు చూపిస్తున్నాయి.

కాబట్టి, తదుపరిసారి మీరు కొత్త డైట్ ప్లాన్ లేదా సప్లిమెంట్ కోసం వెతుకుతున్నప్పుడు, ముందు ఒక్క క్షణం ఆగి ఆలోచించాల్సింది -నా జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేస్తోందా? ఆహారం తిన్న తర్వాత ఉబ్బరం, అసౌకర్యం అనిపిస్తుందా? నిద్ర, చర్మం, శక్తిస్థాయిలు ఎలా ఉన్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడమే మీ ఆరోగ్య ప్రయాణానికి నిజమైన మొదటి అడుగు. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, పులియబెట్టిన ఆహారాలను ఆహారంలో చేర్చుకోవడం, తగినంత నీరు తాగడం, నిదానంగా, నమిలి తినడంవంటి చిన్న చిన్న అలవాట్లు జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తాయి. పునాది గట్టిగా ఉంటేనే ఇల్లు నిలబడుతుంది. అలాగే జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే, మిగతా ఆరోగ్య లక్ష్యాలన్నీ సాధ్యమవుతాయి.

జీర్ణవ్యవస్థను జాగ్రత్తగా చూసుకోవడమంటే, మీ శరీరానికి మీరిచ్చే అతిపెద్ద గౌరవం. బయటి మార్పుల కోసం ఆరాటపడేముందు, లోపలి పునాదిని పదిలం చేసుకోండి. మీ క్రమశిక్షణకు మురిసిపోయి.. ఆరోగ్యం దానంతటదే మీ వెంటపడుతుంది.

# పల్లె బడులవైపు.. బొద్దింకలు!



జంతర్‌మంతర్‌లో వీధుల్లోకి దిగి కేంద్ర ప్రభుత్వాన్నే మెడలు వంచిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కొత్త ఉద్యమానికి తెరతీసింది. ఈ ఏడాది మే 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'సమాజ పరాన్నజీవులు'గా అభివర్ణించడం (ఆ తర్వాత తప్పుగా కోట్ చేశారని ఆయన వివరణ ఇచ్చినా) దేశవ్యాప్తంగా యువతలో ఆగ్రహావేశాలకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే మే 16న అభిజీత్ దీప్కే అనే మాజీ ఆమ్ ఆద్మీ పార్టీ వ్యూహకర్త, వ్యంగ్యాత్మకంగా 'కాక్రోచ్ జనతా పార్టీ'ని స్థాపించారు. జూన్ 6నుంచి జులై 25 వరకూ ఢిల్లీ జంతర్‌మంతర్ కేంద్రంగా సాగిన ఈ ఉద్యమం, నీట్ పేపర్ లీక్ సహా అనేక జాతీయ పరీక్షల్లో అక్రమాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ ఆందోళనలో వేలాదిమంది జెన్-జీ యువత పాల్గొన్నారు. పోలీసు బలప్రయోగంలో దాదాపు 180 మంది గాయపడ్డారు. సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహారదీక్ష చేయడం, పలువురు ప్రముఖులు మద్దతు పలకడంతో ఉద్యమం మరింత ఊపందుకుంది. చివరికి జూలై 26న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో, మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో అరుదైన వెనుకడుగు వేయాల్సి వచ్చింది. ఈ విజయం సాధించిన సీజేపీ.. ఇప్పుడు మరో ఉదాత్తమైన లక్ష్యంతో ముందుకొచ్చింది. అదే -గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలను బాగుచేసుకోవడం!

ఆగస్టు 15న దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీజేపీ 'సర్పంచ్ ఛాలెంజ్' పేరుతో దేశవ్యాప్త ప్రచారోద్యమాన్ని ప్రారంభిస్తోంది. మహారాష్ట్రలోని హింగోలి జిల్లా, సంతూక్ పింప్రి తన సొంత గ్రామం నుంచి ఈ ఉద్యమాన్ని దీప్కే స్వయంగా మొదలుపెట్టనున్నారు. "గత 80 ఏళ్లలో అత్యంత నిర్లక్ష్యానికి గురైంది మన గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలే. కొత్త పార్లమెంటు భవనం కట్టుకున్నాం. కొత్త ప్రధాని నివాసం నిర్మించుకున్నాం. కానీ మన పిల్లలు చదువుకునే బడులను మర్చిపోయాం" అని దీప్కే తన వీడియో సందేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమంలో మూడు ప్రధాన అంశాలున్నాయి. మొదటిది -ఊళ్లో ఉన్నవారు లేదా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు తమ సొంతూరికి వెళ్లి స్థానిక సర్పంచ్‌కు పాఠశాలల మెరుగుదల కోరుతూ విజ్ఞాపన పత్రం సమర్పించడం. రెండోది -పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులే స్వయంగా ఆ పాఠశాలలను సందర్శించి, విద్యుత్, స్వచ్ఛమైన తాగునీరు, పనిచేసే మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన సదుపాయాలున్నాయో లేదో పరిశీలించి సామాజిక తనిఖీ చేపట్టడం. మూడోది -పాఠశాలలను మెరుగుపరిచిన సర్పంచ్‌లను ముందు-తర్వాత ఫొటోలతో సోషల్ మీడియాలో ప్రచారం చేసి, వారికి బహిరంగ గుర్తింపు ఇవ్వడం ద్వారా మరిన్ని గ్రామాలు ఈ దిశగా ప్రేరణ పొందేలా చేయడం. "మీరు మెరుగుపరిచిన బడులను చూసి, మిమ్మల్ని చూసి, ఇంకా చాలామంది సర్పంచ్‌లు తమ గ్రామాల్లో బడులను బాగుచేయడం మొదలుపెడతారు" అని దీప్కే వివరించారు. ప్రయివేటు మాఫియా చేతుల్లో విద్య వ్యాపార వస్తువుగా మారిన నేటి పరిస్థితుల్లో, కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయించినా క్షేత్రస్థాయిలో సద్వినియోగం కాకుండా మిగిలిపోతున్న ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుకోగలిగితే, సామాన్యుల పిల్లలకూ నాణ్యమైన విద్య అందుతుందన్నది ఉద్యమం వెనుక ఉన్న సూత్రం. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూసుకోవడం కూడా ఇందులో అంతర్భాగమే. ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్ ఇటీవల సీజేపీ ఉద్యమాన్ని ప్రశంసిస్తూ.. "ఆశ పూర్తిగా సన్నగిల్లిన తరుణంలో వర్షంలో స్వారీ చేస్తూ వచ్చిన యువ 'బొద్దింకల' తరం.. ఒక న్యాయమూర్తి, ఒక వ్యంగ్యం కలయిక నుంచి పుట్టిన సంతానం"గా అభివర్ణించడం విశేషం. ఈ మద్దతు, జెన్-జీ చైతన్య శక్తిపై సమాజంలోని మేధావి వర్గం ఎంత విశ్వాసం పెంచుకుందో స్పష్టం చేస్తోంది.

పాఠశాలలను ప్రజలే స్వచ్ఛందంగా బాగుచేసుకోవాలన్న ఆలోచన కొత్తది కాకపోవచ్చు. దీనిని ఇంత భారీస్థాయిలో, దేశవ్యాప్త ఉద్యమంగా, ఒక రాజకీయ పార్టీ నేతృత్వంలో నిర్వహించడం మాత్రం అరుదైన ప్రయోగమే. సాధారణంగా గ్రామాల్లో సామాజిక బాధ్యతగా పాఠశాలల అభివృద్ధికి స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు పాటుపడిన సందర్భాలు దేశంలో ఇప్పటికే ఉన్నా, వాటిని జాతీయస్థాయి ఉద్యమంగా, సామాజిక మాధ్యమాల శక్తిని ఉపయోగించుకుంటూ, పోటీతత్వాన్ని ప్రేరేపిస్తూ నిర్వహించడం సీజేపీ నమూనాలోని ప్రత్యేకత. ఇది ఎంతవరకు సఫలమవుతుందన్నది కాలమే నిర్ణయిస్తుంది.. కానీ కొన్ని అంశాలు దీని విజయావకాశాలను బలపరుస్తున్నాయి. మొదటిది -ఇది ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగా ఢీకొట్టే ఆందోళన కాదు. గ్రామస్థాయి పాలనా వ్యవస్థతో సానుకూలంగా సంభాషించే నిర్మాణాత్మక ప్రయత్నం. కాబట్టి రాజకీయ ఘర్షణలకు తావు తక్కువ. రెండోది -జంతర్‌మంతర్ ఉద్యమం ద్వారా సీజేపీ ఇప్పటికే భారీ యువజన నెట్‌వర్క్‌ను నిర్మించుకుంది. ఆ ఊపును ఇప్పుడు నిర్మాణాత్మక దిశగా మళ్లించడం సాధ్యమే. మూడోది -సర్పంచ్‌లకు ప్రజాభిమానం, ప్రచారం లభిస్తే, గ్రామీణ రాజకీయాల్లో అది వారికి రాజకీయంగా కూడా ప్రయోజనం చేకూరుస్తుంది కాబట్టి, స్వచ్ఛందంగా ముందుకొచ్చే అవకాశం ఎక్కువ. అయితే, సవాళ్లు కూడా తక్కువేమీ కాదు. నిధుల కొరత ఉన్న గ్రామ పంచాయతీలు మౌలిక సదుపాయాలు సమకూర్చడం అంత తేలిక కాదు. కేవలం సామాజిక ఒత్తిడితో మాత్రమే శాశ్వత పరిష్కారం లభించదు. ఇది ప్రభుత్వ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసే ప్రయత్నంగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సీజేపీపై ఉంది. మొత్తంమీద, ఎన్నికల్లో పోటీ చేయని, వ్యంగ్యంతో పుట్టిన ఈ పార్టీ, కేవలం నిరసనలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మక కార్యాచరణవైపు అడుగేయడం సానుకూల పరిణామం. ఇది ప్రభుత్వాలకు సున్నితమైన హెచ్చరిక కూడా. =ప్రజలు ఇక ఖాళీ వాగ్దానాలతో సంతృప్తిపడరని, తమ పనులు తామే చేసుకునేంత చైతన్యం, సంకల్పం వారికుందని ఉద్యమం చాటిచెబుతోంది. జంతర్‌మంతర్‌లో పోరాడి ఒక మంత్రిని దించగలిగిన శక్తి, ఇప్పుడు గ్రామాల్లో బడులను బాగుచేసే దిశగా మళ్లడం, జెన్-జీ ఉద్యమం కేవలం ఆగ్రహావేశాలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక సామాజిక మార్పుకూ నాయకత్వం వహించగలదని నిరూపిస్తోంది. ఈ ఉద్యమం ఎంతవరకు విజయవంతమవుతుందన్నది ప్రజాభాగస్వామ్యం, సర్పంచ్‌ల చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉంటుంది. అయితే, ఒక్క విషయం మాత్రం స్పష్టం. జెన్-జీ ఇకపై కేవలం సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానాలకే పరిమితం కాకుండా, వీధుల్లోకి దిగి, గ్రామాలవైపు కదిలి, తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకునే దిశగా అడుగులేస్తోంది. ఇది ప్రభుత్వాలకు, రాజకీయ వ్యవస్థకు ఒక స్పష్టమైన సందేశం -ఇకపై నిర్లక్ష్యానికి తావు లేదు, జవాబుదారీతనమే శరణ్యం. ■



స్పష్టత ఉంటేనే పురోగతి. లక్ష్యాల పట్ల నాయకుడికి స్పష్టత లేకపోతే.. బృందంలో కూడా అయోమయం నెలకొంటుంది. మీ సంస్థ లేదా బృందం ఏ దిశగా పయనిస్తోందో అక్కడ పనిచేసే ప్రతి ఒక్కరూ ఒక వాక్యంలో చెప్పలేకపోతే.. మీరు స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించనట్లే. స్పష్టమైన దిశా నిర్దేశం చేయడం అనేది నాయకుడి బాధ్యత మాత్రమే కాదు, తప్పనిసరి అర్హత కూడా. స్పష్టత లేని నాయకత్వం, గమ్యం తెలియని ప్రయాణంలా వృథా శక్తినే మిగుల్చుతుంది. దిశ స్పష్టంగా ఉంటేనే, బృందంలో ప్రతి అడుగూ ఒకే గమ్యం వైపు కదులుతుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# ఉలితో మలచిన ఊరి దారి!



చైనాలోని చాంగ్‌కింగ్ ప్రావిన్స్‌లో సముద్రమట్టానికి 3,000 అడుగుల ఎత్తులో ఉన్న లాన్యింగ్ గ్రామం, బయటి ప్రపంచంతో దాదాపు సంబంధమే లేకుండా ఒంటరిగా మిగిలిపోయింది. 2001లో ఆ గ్రామంలోని 23 కుటుంబాలు కలిసి, కొండను తొలుచుకుంటూ ఒక రహదారి నిర్మించాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఇరుకైన కొండ మార్గంలో యంత్రాలు వాడే వీలు లేకపోవడంతో, సుమారు 80 మంది గ్రామస్తులు ఉలి, సుత్తి పట్టుకుని రాతిని చేతులతోనే తొలిచారు. ఒక్కో కుటుంబం రహదారిలో ఒక భాగాన్ని చెక్కే బాధ్యత తీసుకుంది. ఇలా దాదాపు నాలుగేళ్లపాటు శ్రమించి, 1.2 కిలోమీటర్ల పొడవైన రహదారికి ప్రాథమిక రూపాన్ని ఇచ్చారు. 2016లో చాంగ్‌కింగ్ ప్రభుత్వం ఈ రహదారిని బలోపేతం చేసి, వెడల్పు పెంచేందుకు అనుమతించింది. కొన్నిచోట్ల 22.9 శాతం ఏటవాలుతో అత్యంత ప్రమాదకరమైన మార్గంగా పేరొందిన ఈ రహదారి, చాంగ్‌కింగ్‌లోనే అత్యంత లోతైన లాన్యింగ్ కనుమ అందాలను చూసేందుకు సాహసికులను ఆకర్షిస్తోంది.

# బ్రెజిల్ మ్యాచ్ కోసం..
# ఫిఫా ఆసియన్ కప్ నుంచి తప్పుకున్న భారత్

**ఢిల్లీ :** ఈ ఏడాది అక్టోబర్‌లో బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టుతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడేందుకు వేయి కండ్లతో ఎదురుచూస్తున్న భారత్.. అరంగేట్ర ఫిఫా ఆసియన్ (అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్ట్ ఆసియన్ నేషన్స్) కప్ నుంచి వైదొలిగింది. దక్షిణాసియా దేశాల కోసం ఫిఫా తీసుకొచ్చిన ఈ టోర్నీలో ఆడేందుకు తొలుత ఆమోదం తెలిపిన భారత్.. తర్వాత బ్రెజిల్ మ్యాచ్‌తో షెడ్యూల్ క్లాష్ కారణంగా తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. ఫిఫా ఆసియన్ కప్ సెప్టెంబర్ 21న మొదలై అక్టోబర్ 4తో ముగియనుండగా భారత్, బ్రెజిల్ మ్యాచ్ అక్టోబర్ 3న జరగాల్సి ఉంది. టోర్నీ నుంచి తప్పుకున్న నేపథ్యంలో ఏఐఎఫ్ఎఫ్ జనరల్ సెక్రటరీ ఎం. సత్యనారాయణ స్పందిస్తూ.. 'అవును. మేం ఆసియన్ కప్ నుంచి వైదొలిగాం.




షెడ్యూలే ఇందుకు ప్రధాన కారణం. ఏకకాలంలో రెండు మ్యాచ్‌లను ఆడటం కష్టం. ఆసియన్ కప్ ఫైనల్ అక్టోబర్ 4న జరుగుతుంది. కానీ మాకు బ్రెజిల్‌తో అక్టోబర్ 3న మ్యాచ్ ఉంది. బ్రెజిల్‌తో పోరు మాకు అతిపెద్ద అవకాశం. ఆసియన్ కప్‌లో ఉన్న దేశాలతో (సింగపూర్, మలేషియా, ఇండోనేషియా) మేం గతంలో చాలా మ్యాచ్‌లు ఆడాం. భవిష్యత్‌లోనూ ఆడతాం. కానీ బ్రెజిల్‌తో మ్యాచ్ ఆడే అవకాశం ఎప్పుడు వస్తుందో తెలియదు. ప్రపంచంలో ఐదో ర్యాంకులో ఉన్న బ్రెజిల్.. 138వ ర్యాంకు కల్గిన మాతో ఆడేందుకు వస్తుండటం మాకు అతిపెద్ద విషయం. ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ అవకాశాన్ని మేం కోల్పోదలుచుకోలేదు' అని తెలిపాడు.

---

## ముప్పంతా ఆ ఇద్దరితోనే..
## ప్రభాత్, మెండిస్‌తో భారత్‌కు తిప్పలు

**ఈ స్పిన్ ద్వయానికి గాలెలో తిరుగులేని రికార్డు**

**గాలె :** ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తు రేసులో నిలవాలంటే ఇకనుంచి ప్రతి మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో రెండు టెస్టులు ఆడేందుకు శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత జట్టు శనివారం నుంచి ఆతిథ్య జట్టుతో స్పిన్ సమరానికి సిద్ధమవుతున్నది. టీమిండియాతో పోలిస్తే పేపర్‌పై లంక జట్టు బలహీనంగా కనిపిస్తున్నప్పటికీ సొంతగడ్డపై లంకేయులు సింహాల్లా గర్జించగలరు. ఏండ్లుగా తమ అమ్ములపొదిలో దాగిన స్పిన్ అస్త్రంతోనే గిల్ సేనను బోల్తా కొట్టించేందుకు ఆ జట్టు ప్రణాళికలు సిద్ధం చేసింది. ముఖ్యంగా పర్యాటక జట్టుకు లంక స్పిన్ ద్వయం ప్రభాత్ జయసూర్య, రమేశ్ మెండిస్ నుంచి ముప్పు పొంచి ఉంది. మొదటి టెస్టుకు ఆతిథ్యమివ్వనున్న గాలెలో ఈ ఇద్దరికీ తిరుగులేని రికార్డు ఉంది. ప్రత్యర్థి ఎంత మేటి బ్యాటర్ అయినా గాలెలో వీరి ఉచ్చులో చిక్కుకుని బయటపడటం అంత సులభమేమీ కాదన్నది గణాంకాలు చెబుతున్న కఠిన వాస్తవం.

**కింగ్స్ ఆఫ్ గాలె..**

క్రికెట్‌లో కొంతమంది ఆటగాళ్లకు ఎంతో ఇష్టమైన, తాము అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేసే స్టేడియాలు కొన్ని ఉంటాయి. మిగతా వేదికల కంటే అక్కడ వారు మరింత మెరుగ్గా రాణించగలరు. సచిన్‌కు వాంఖెడే, కోహ్లికి అడిలైడ్ (ఆస్ట్రేలియా), దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్‌కు కొలంబో మాదిరిగా ప్రస్తుత లంక జట్టులో ఉన్న జయసూర్య, మెండిస్‌కు గాలె వెరీ వెరీ స్పెషల్. ఈ ఇద్దరూ కలిసి ఇక్కడ 23 మ్యాచ్‌లు ఆడి ఏకంగా 145 వికెట్లు పడగొట్టారంటే అక్కడ వీరి ఆధిపత్యం ఏ రేంజ్‌లో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. లెఫ్మార్ట్ స్పిన్నర్ జయసూర్య 11 టెస్టుల్లోనే 81 వికెట్లు తీస్తే ఆఫ్ స్పిన్నర్ మెండిస్ 12 మ్యాచుల్లో 64 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఇద్దరినీ నిలువరించడం భారత బ్యాటర్లకు శక్తికి మించిన పనే. గాలి అధికంగా వీచే గాలెలో దానిని సద్వినియోగం చేసుకుని






ఫ్లైటెడ్ డెలివరీలతో బ్యాటర్లను బుట్టలో వేసుకోవడంలో ప్రభాత్ సిద్ధహస్తుడు. జట్టు సహచరులు 'కింగ్ ఆఫ్ గాలె'గా పిలుచుకునే అతడి స్పిన్ తంత్రాన్ని ఛేదించి పరుగులు రాబట్టాలంటే గిల్ అండ్ కో. చెమటోడ్చాల్సిందే.

**ఆ మచ్చను తుడిచేస్తారా?**

ఒకప్పుడు భారత బ్యాటర్లు స్పిన్ ఆడటంలో ఆరితేరినవారు. స్వదేశంలో స్పిన్‌తోనే ప్రత్యర్థిని దెబ్బకొట్టి ఆ తర్వాత అపోజిషన్ బౌలర్ల (ముఖ్యంగా స్పిన్నర్ల)ను చీల్చిచెండాడటంలో టీమిండియాకు ఘనమైన రికార్డు ఉండేది. షేన్ వార్న్, మురళీధరన్ వంటి దిగ్గజ స్పిన్నర్లను ద్రావిడ్, సచిన్, లక్ష్మణ్, సెహ్వాగ్ వంటి బ్యాటర్లు నిలువరించి సెంచరీల మీద సెంచరీలు కొట్టారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నం. సొంతగడ్డపై 2024లో న్యూజిలాండ్ కొట్టిన చావుదెబ్బ నుంచి తేరుకోకముందే నిరుడు దక్షిణాఫ్రికా సైతం భారత్‌ను వైట్‌వాష్ చేయడం జట్టుకు కోలుకోలేని దెబ్బ. కివీస్ లెఫ్టార్మ్ స్పిన్నర్లు అజాజ్ పటేల్, మిచెల్ శాంట్నర్ నాటి రోహిత్ సేనకు చుక్కలు చూపిస్తే 2025లో సౌతాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ సిమోన్ హర్మర్ దెబ్బకు ఆకాశంలో విహరించిన టీమిండియాను అమాంతం నేలకు దించాడు. ఇక ఇప్పుడు ప్రభాత్ కూడా లెఫ్మార్మ్ స్పిన్నరే. భారత బ్యాటర్ల బలహీనతే అతడి బలం. అతడికి తోడు రమేశ్ కూడా మరో ఎండ్‌లో దాడి చేయనుండటంతో రెండువైపులా భారత్‌కు ముప్పు తప్పదు. ప్రస్తుతం ఉన్న జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు తప్ప మిగిలిన బ్యాటర్లను ఇక్కడ ఆడిన అనుభవం లేకపోవడం భారత్‌కు ప్రతికూలాంశం. కానీ ఈ స్పిన్ ద్వయం నుంచి ఎదురయ్యే ముప్పును దాటితేనే సిరీస్‌లో భారత విజయావకాశాలు మెరుగుపడతాయి. మరి గిల్ సేన ఏం చేస్తుందనేది ఆసక్తికరం.

---

## స్పోర్ట్స్

## కంగారూలకు ఝలక్..
## తొలి ఇన్నింగ్స్‌లో 198 ఆలౌట్

**హసన్‌కు ఆరు వికెట్లు**




**డార్విన్ :** 'ఈ టెస్టు మూడు రోజుల్లోనే ముగుస్తుందా? లేక ఐదు రోజులు సాగుతుందా?' ఆస్ట్రేలియాలో టెస్టు మ్యాచ్ ఆడేందుకు వచ్చిన బంగ్లాదేశ్ సారథి నజ్ముల్ హోసేన్‌కు ఫస్ట్ టెస్టు ప్రారంభానికి ముందు విలేకరుల నుంచి ఎదురైన ప్రశ్న ఇది. కట్ చేస్తే.. డార్విన్ వేదికగా గురువారం ఆరంభమైన ఫస్ట్ టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాకు బంగ్లా పేసర్లు ఊహించని షాకిచ్చారు. పిచ్‌పై ఉన్న పచ్చిక, స్థానిక వాతావరణ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బంతితో చెలరేగి కంగారూలను 198 రన్స్‌కే కుప్పకూల్చారు. యువ పేసర్ హసన్ మహ్మద్ (6/55) కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేయగా ఎబాదత్ (2/39), టస్కిన్ అహ్మద్ (2/55) తలా రెండు వికెట్లు పడగొట్టారు. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 71) టాప్ స్కోరర్. ఆసీస్ టాపార్డర్‌లో ట్రావిస్ హెడ్ (22), వెదరాల్డ్ (23), కామెరూన్ గ్రీన్ (13), మార్నస్ లబూషేన్ (1) బంగ్లా పేసర్ల ధాటికి తేలిపోయారు. లంచ్ విరామానికే 74/4తో నిలిచిన ఆతిథ్య జట్టును స్మిత్, క్యారీ (19) నిలబెట్టే యత్నం చేశారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 56 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించే పనిలో ఉండగా ఎబాదత్.. క్యారీని పెవిలియన్‌కు పంపి కంగారూలకు కళ్లెం వేశాడు. ఆ తర్వాత వచ్చిన లోయరార్డర్ కూడా చేతులెత్తేసింది. కాగా బంగ్లాదేశ్‌తో టెస్టుల్లో ఆస్ట్రేలియాకు ఇదే అత్యల్ప స్కోరు. గతంలో మీర్పూర్ (2017లో) టెస్టులో 217 రన్స్ చేయడమే ఇప్పటిదాకా అత్యల్పం. ఆసీస్‌ను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసిన బంగ్లా.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చి నిలకడగా ఆడుతున్నది. ఆసీస్ బ్యాటర్లు విఫలమైన పిచ్‌పై తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు ఒక వికెట్ నష్టానికి 96 రన్స్ చేసింది. తాంజిద్ (32 బ్యాటింగ్ ), మోమినుల్ (35 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

---



**ప్రకృతి పావని: ఇన్‌స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ వర్ధమాన నటిగా మారింది**

## మ్యూజికల్ ప్రమోషన్ స్ట్రాటజీ..
## ఆడియో, విజువల్ ఫీస్ట్ ఫిక్స్!

భారతీయ చిత్రసీమలో తనదైన డ్యాన్స్ మూమెంట్స్‌తో కుర్రకారును ఊపేస్తున్న ఇద్దరు భామలు జాన్వీ కపూర్, శ్రీలీల మొదటిసారి ఒకే స్క్రీన్‌ను పంచుకోబోతున్నారు. ఉమేష్ బిస్త్ దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న ఓ హిందీ రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించనున్నారు. దేశంలోనే టాప్ క్లాస్ డ్యాన్సర్లుగా పేరు తెచ్చుకున్న ఈ ఇద్దరు గ్లామర్ క్వీన్స్ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో ఆడియో మరియు విజువల్ పరంగా ప్రేక్షకులకు పూనకాలు తెప్పించే విందు దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ఆ విశేషాలు చూద్దాం..

**ఒకే ఫ్రేమ్‌లో ఇద్దరు డ్యాన్స్ క్వీన్స్:**

శ్రీలీల తన ఎనర్జిటిక్ డ్యాన్స్ స్టెప్పులతో సౌత్‌లో ఇప్పటికే ఊపు ఊపేస్తుండగా, జాన్వీ కపూర్ తన గ్రేస్‌ఫుల్ మూమెంట్స్‌తో బాలీవుడ్‌ను ఏలుతోంది. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో డ్యాన్స్ నంబర్స్ మరియు చార్ట్‌బస్టర్ సాంగ్స్ రాబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

**మ్యూజికల్ చార్ట్‌బస్టర్ స్కోప్.. ప్రమోషన్ స్ట్రాటజీ:**

ఈ చిత్రాన్ని బాలీవుడ్ ప్రముఖ నిర్మాతలు ఏక్తా కపూర్, గునీత్ మోంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ బిగ్ ప్రొడ్యూసర్స్ కాంబినేషన్ కావడం వల్ల సినిమా ప్రమోషన్లకు డ్యాన్స్ అండ్ మ్యూజికల్ ఆల్బమ్‌నే ప్రధాన అస్త్రంగా వాడుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక ఆడియో రిలీజ్ నుంచే మాస్ పాటలు, స్పెషల్ డ్యాన్స్ నంబర్లతో సోషల్ మీడియాను, యూట్యూబ్‌ను షేక్ చేసేలా వినూత్న మ్యూజికల్ ప్రమోషన్ స్ట్రాటజీని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

**ముక్కోణపు ప్రేమకథగా ఉత్కంఠభరితమైన లైన్:**

ఇద్దరు అందాల భామలు ఒకే పురుషుడిపై ప్రేమను పెంచుకోవడం, వారి మధ్య ఏర్పడే మానసిక సంఘర్షణ, అసూయ మరియు ఆధిపత్య పోరు నేపథ్యంలో ఈ రొమాంటిక్ థ్రిల్లర్ సాగనుంది. ఇక రొమాన్స్, మిస్టరీ మరియు ఊహించని మలుపులతో కథ నడుస్తుంది.ఇక శ్రీలీలకు బాలీవుడ్‌లో ఇది ఒక పెద్ద మైలురాయి కాగా, సరైన సక్సెస్ కోసం చూస్తున్న జాన్వీకి ఈ ప్రాజెక్ట్ ఎంతో ముఖ్యం కానుంది.





**హీరో ఎవరనేదే ఇప్పుడు అసలు ఆసక్తి:**

నవంబర్ నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, హీరోయిన్లను ఖరారు చేసిన మేకర్స్ ప్రస్తుతం హీరో వేటలో ఉన్నారు. బాలీవుడ్‌కు చెందిన కొందరు యంగ్ అండ్ పాపులర్ స్టార్స్‌ను ఈ పాత్ర కోసం పరిశీలిస్తున్నారు. ఇక ఇద్దరు టాప్ డ్యాన్సర్ల మధ్య నటించే ఆ అదృష్టవంతుడైన యంగ్ హీరో ఎవరనేది ప్రస్తుతం బిగ్ సస్పెన్స్‌గా మారింది.

**స్క్రీన్‌పై అదిరిపోయే జాతర:**

ఉమేష్ బిస్త్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ కథాంశంతో పాటు మ్యూజిక్, డ్యాన్స్ పరంగా సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక ఏక్తా కపూర్, గునీత్ మోంగా కాంబినేషన్ తెస్తున్న ఈ మ్యూజికల్ విజువల్ థ్రిల్లర్ థియేటర్లలో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



**కియారా అద్వానీ: 'ఫగ్లీ' నుండి 'టాక్సిక్' వరకు -- ఒక తార ప్రయాణం**

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com